Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్



ఫిబ్రవరి 23న గ్రూప్-2 ప్రధాన పరీక్ష

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

బుధవారం 13 నవంబర్ 2024 తిరుపతి
సంపుటి 1 సంచిక 144 పేజీలు 10 వెల: రూ.6.00
Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# రాష్ట్రంలో కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్రాజెక్టులు

## రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టులు - రిలయన్స్‌తో ప్రభుత్వం ఒప్పందం

**అమరావతి-సూర్య వాస్తవం**

రాష్ట్రంలో రూ.65 వేలకోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రిలయన్స్ ఇండిస్టీస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో సచివాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఎంఒయుపై ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, రిలయన్స్ ఇండిస్టీస్ ముంబై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయం, 2.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఒక్కో ప్లాంట్ రూ.130 కోట్లతో ఏర్పాటవుతుందని, 2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సాలిడ్ వేస్ట్‌ను ప్లాంట్స్‌కు ఇస్తామన్నారు. రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించాలనే లక్ష్యంగా క్లీన్ ఎనర్జీ పాలసీ–2024 తీసుకొచ్చామన్నారు. పెట్టుబడులకు రాష్ట్రంలో

- మిగతా 2లో..



## జపాన్ ప్రధానిగా మళ్లీ ఇషిబా

### - మైనార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం



**టోక్యో-సూర్య వాస్తవం:** జపాన్ ప్రధాన మంత్రి షిగెరు ఇషిబా తిరిగి లాంఛనంగా ఎన్నికయ్యారు. పార్లమెంటు చరిత్రలో అరుదైన రీతిలో రనాఫ్ రౌండ్‌లో ఆయన ఎన్నికయ్యారు. దీంతో ఆయన నేతృత్వంలో మైనార్టీ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ప్రతిపక్ష కూటమి నుంచి ఆయనకు ఈ సారి గట్టి ప్రతిఘటన ఎదురవుతుంది. కొత్త ప్రధాని ఎన్నిక దగ్గర నుంచే ప్రతిఘటన మొదలైంది. ప్రధాన మంత్రి పదవి కోసం పలువురు అభ్యర్థులు బరిలోకి దిగారు. మొత్తం 465 స్థానాలు ఉన్న పార్లమెంటులో సాధారణ మెజార్టీకి అవసరమైన 233 ఓట్లు ఎవరికీ లభించలేదు. దీంతో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల మధ్య రనాఫ్ ఎన్నిక నిర్వహించగా, ఇషిబాకు 221 ఓట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థి, ప్రధాన ప్రతిపక్షమైన జపాన్ కానిస్టిట్యూషనల్ డెమొక్రాటిక్ పార్టీ నాయకుడు యోషి హికో నోడాకు 160 ఓట్లు లభించాయి. 84 ఓట్లు చెల్లనివిగా

- మిగతా 2లో..

## బీజేపీని గద్దెదించినపుడే ఉద్యోగావకాశాలు



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపిని గద్దెదించితేనే ఉద్యోగావకాశాలు వస్తాయని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. రివ్యూ ఆఫీసర్ (ఆర్ఒ), అసిస్టెంట్ రివ్యూ ఆఫీసర్ (ఎఆర్ఒ) మరియు ప్రావిన్షియల్ సివిల్ సర్వీస్ (పిసిఎస్) ప్రిలిమనరీ పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలన్న ఉత్తరప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిపిఎస్‌సి) నిర్ణయంపై అభ్యర్థులు సోమవారం ప్రయాగ్‌రాజ్‌లోని యుపిపిఎస్‌సి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గేటువద్దే కమిషన్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారికి మద్దతుగా మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ ఎక్స్‌లో స్పందించారు. అన్యాయంగా బుల్డోజర్‌ను ప్రయోగించే బిజెపి.. మెరుగైన పాలన సాగించి వుంటే విద్యార్థుల ఆగ్రహానికి భయపడి ఇళ్లలో దాక్కునే అవసరం వచ్చేది కాదని అన్నారు. సంవత్సరాలుగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల్లో ఆగ్రహం

- మిగతా 2లో..

## పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సహకరించండి

### - ఢిల్లీలో విద్యుత్‌శాఖ మంత్రుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్-సూర్య వాస్తవం**

రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్‌లో జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాల విద్యుత్‌శాఖల మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని విద్యుత్‌రంగ స్థితిగతులు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు తొలిప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. దీనికోసం కేంద్రం నుంచి పలు రాయితీలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇటీవల విదేశాల్లో పర్యటించి వచ్చిన అంశాలు, సాంకేతికత విషయాలను వివరించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ తదితరులు ఉన్నారు.

## నేడు జార్ఖండ్‌లో తొలిదశ ఎన్నికలు

### - 31 అసెంబ్లీ, వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికకు కూడా..



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం**

జార్ఖండ్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. నేడు 43 స్థానాల్లో పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్‌కు అనుమతిస్తారు. అయితే కొన్ని బూత్‌ల్లో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరగనుంది. భద్రత కోసం 200కుపైగా కంపెనీల భద్రత దళాలను మోహరించారు. బుధవారం దేశవ్యాప్తంగా మరో 31 అసెంబ్లీ స్థానాలు, కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొమ్మిది, రాజస్థాన్‌లో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఆరు, అస్సాంలో ఐదు, బీహార్, పంజాబ్‌ల్లో

- మిగతా 2లో..



## ప్రభుత్వ తీరు అమానుషం

### - లగచర్ల వాసులను తక్షణం విడుదల చేయాలి - మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్-సూర్య వాస్తవం**

లగచర్ల వాసుల పట్ల ప్రభుత్వ తీరు అమానుషంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ట్వీట్ చేశారు. లగచర్ల గ్రామానికి 300 మంది పోలీసులు చేరుకొని గ్రామస్థులను అరెస్టు చేయడం, ఫార్మా భూసేకరణకు నిరాకరించిన వారిని పోలీసులతో బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. అర్ధరాత్రి పోలీసులతో ప్రభుత్వం దమనకాండ నిర్వహించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం తీరును ఖండించారు. ప్రజాభిప్రాయాన్ని తీలుసుకోకుండా భూసేకరణ చేపట్టడం వెనుక ఉన్న రేవంత్ రెడ్డి ఉద్దేశ్యం తెలియాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం వ్యక్తిగత ప్రయోజనాలకోసం చేపడుతున్న భూసేకరణను తక్షణం నిలిపేయాలని డిమాండ్ చేశారు. పోలిసుల అదుపులో ఉన్న గ్రామస్థులను, రైతులను తక్షణం విడుదల చేయాలని కోరారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## జపాన్ ప్రధానిగా
# మళ్లీ ఇషిబా

(మొదటిపేజీ తరువాయి)
పరిగణించడంతో ఇషిబాను విజేతగా ప్రకటించారు. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా ఇషిబా సంకీర్ణ ప్రభుత్వం గత నెల 27న జరిగిన ఎన్నికల్లో పరాజయం పాలైంది. ఇషిబా నేతృత్వంలోని పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి), జూనియర్ భాగస్వామి కొమెటో మెజారిటీని కోల్పోయాయి. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఎల్‌డిపి వైఫల్యంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం ఈ ఫలితాల్లో ప్రతిబింబించింది. జపాన్ రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు ముగిసిన 30 రోజుల్లోగా కొత్త నేతను ఎన్నుకోవాల్సి వుంది. అందుకోసం ప్రత్యేక పార్లమెంటరీ సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు.. గత కేబినెట్ సభ్యుల్లో చాలామందిని తిరిగి నియమించే అవకాశాలు వున్నాయి. ఎన్నికల్లో ఓడినా ఇషిబా గద్దె దిగడానికి తిరస్కరించారు.

## నేడు జార్ఖండ్‌లో
# తొలిదశ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)
నాలుగేసి స్థానాలు, కర్ణాటకలో మూడు, కేరళ, మధ్యప్రదేశ్‌ల్లో రెండేసి స్థానాలకు, ఛత్తీస్‌గఢ్, గుజరాజ్, మేఘాలయలో ఒకొక్క స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

# బీజేపీని గద్దెదించినపుడే ఉద్యోగావకాశాలు

(మొదటిపేజీ తరువాయి)
వ్యక్తమవుతోంది. బిజెపి ప్రభుత్వ తీరుతో విద్యార్థులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అఖిలేష్ పేర్కొన్నారు. విద్యార్థులపై లాఠీ చార్జ్ చేసిన అసమర్థ ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి ఉండటానికి వీల్లేదని అన్నారు. ఉద్యోగాల కల్పన అనేది వారి అజెండాలో లేదని మండిపడ్డారు. విద్యావంతులు, ఉద్యోగాలు చేసే మధ్యతరగతి ప్రజలు ఇకపై బిజెపి భావోద్వేగాలకు లొంగిపోరని అన్నారు. ఒకప్పుడు వాట్సాప్ గ్రూపుల్లో బిజెపి తప్పుడు ప్రచారానికి బలైన వారి తల్లిదండ్రులు బిజెపి వారిని మానసికంగా ఎలా ఉపయోగించుకుందో ఇప్పుడు తెలుసుకుంటున్నారని తెలిపారు. బిజెపి చేస్తున్న విభజన, మత రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారని, మంచి రాజకీయాల వైపు చూస్తున్నారని అన్నారు. బిజెపికి మానసిక బానిసలుగా ఉండేందుకు ఎవరూ సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**బంగారుపాళ్యం-సూర్య వాస్తవం, నవంబర్ 12:** బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పటల్ వైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ (ఎయిడ్స్ టీబీ లెప్రసీ) తదితర విషయాలపై ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని లింక్ ఏఆర్టీ కేంద్రం క్షయ నివారణ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మరింతగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అక్కడి ఉద్యోగులకు తెలిపారు. ఎయిడ్స్ టీబి వ్యాధులపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాబు, ల్యాబ్ టెక్నీషియన్ భువన,జయచంద్ర, ల్యాబ్ సూపర్వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## పౌర గ్రంథాలయశాఖ గోడ పత్రికల ఆవిష్కరణ

**చిత్తూరు-సూర్య వాస్తవం:** మంగళవారం జిల్లా సచివాలయం లోని కలెక్టర్ ఛాంబర్ నందు 57 వ వారోత్సవాలు పురస్కరించుకుని పౌర గ్రంథాలయ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ముద్రించిన గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఏపీ సీఎంకు చిత్తూరు ముస్లింలు అభినందనలు

**చిత్తూరు-సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ముస్లిం మైనార్టీ నాయకులు సమావేశమైనారు. ఈ సమావేశంలో మైనారిటీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అధికారం చేపట్టిన మొదటి బడ్జెట్లో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.4,376 కోట్లు కేటాయించి నందుకు ముస్లింలు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో చిత్తూరు మైనార్టీ నాయకులు ఫిరోజ్, జాఫర్, అత్తు, ఆన్సర్, గౌస్, మహబూబ్, జిలాని, రియాజ్, ఆన్సర్, టైలర్ భాష, సిరాజ్, అబుల్, మూసా తదితరులు పాల్గొన్నారు.




## 26న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

**- ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు**

**చిత్తూరు-సూర్య వాస్తవం:** చిత్తూరు ఎస్టియు కార్యాలయంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ మంగళవారం ఉదయం సమావేశం సుగుణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ .నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం అనేక ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను, హక్కులతో పాటు 44 కార్మిక కోడ్ లను 4 కోడ్ లు గా కుదించడం దుర్మార్గపు చర్య అని వాపోయారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం రైతు, కార్మిక, మహిళా, దళితుల, విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోక పోగా దేశంలో ఉన్న కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ లాభాల బాట లో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేయడానికి ఆదాని అంబానీ లకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్న బిజెపి మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని కార్మిక వర్గానికి పిలుపు ఇచ్చారు కేంద్ర ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నవంబర్ 26న జరిగే చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటియుసి నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రమాదేవి, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు వి. దామోదరం, పి రఘు, చిత్తూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ , జయశంకర్, రమణి, సురేష్ , ఈశ్వరన్, సుకన్య, బుల్లెమ్మ, వినాయకమ్మ పాల్గొన్నారు.




# రాష్ట్రంలో కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్రాజెక్టులు

(మొదటిపేజీ తరువాయి)
అనుకూల పరిస్థితులు ఉన్నాయని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపి కేంద్రంగా నిలస్తుందని చెప్పారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులకు ఎస్కార్ట్‌గా ఐఎఎస్ అధికారులను నియమించి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా వేగంగా ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పారు.

ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తిని ఎస్కార్ట్ అధికారిగా నియమిస్తున్నామని వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి, ఉద్యోగాల కల్పన ఛైర్మన్ నారా లోకేష్ మాట్లాడుతూ.. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇది ముందడుగని చెప్పారు.

దేశవ్యాప్తంగా రెండు వేల ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకోగా అందులో 500 ప్లాంట్లు రాష్ట్రంలో పెట్టడం సంతోషకరమన్నారు. ఒప్పందం మేరకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఏ అవసరం వచ్చినా తాను వెంటనే స్పందిస్తానని తెలిపారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రిలయన్స్ 8 జిల్లాల్లో ప్లాంట్లు పెడుతుందని అన్నారు. మొదటి ప్లాంట్ ప్రకాశం జిల్లా కనిగిరిలో ఏర్పాటవుతుందని చెప్పారు.

# ఉచిత ఇసుక విధానంలో అక్రమాలపై నిఘా

**- పర్యాటక రంగంపై దృష్టి సారించాలి**
**- టీటీడీ కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**

**అమరావతి-సూర్య వాస్తవం:** ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని చెప్పారు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. టిడిపి కూటమి శాసనసభాపక్ష సమావేశం అసెంబ్లీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొన్న ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి 150 రోజులైందని, ఈ కాలంలో దెబ్బతిన్న వ్యవస్థలను పునర్ నిర్మిస్తూ ముందుకెళుతున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ పేదలతో మమేకమవ్వాలని, వారి కనీస అవసరాలు తీర్చాలని చెప్పారు. పర్యాటక రంగం అభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలను గుర్తించాలని చెప్పారు. రాబోయే ఐదేళ్లు ఈ రంగంపై శ్రద్ధ పెడితే ఉపాధి అవకాశాలు పెద్దయెత్తున పెరుగుతాయని తెలిపారు. పర్యాటక రంగానికి కావాల్సింది గదులు, ఆస్పత్రులు, ఈవెంట్స్, ట్రావెల్ సదుపాయాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో 20 వేల గదులు నిర్మించేలా టాటా కంపెనీతో చర్చలు జరుపుతామని తెలిపారు. ఈ రంగంలో ప్రభుత్వం రూపాయి ఖర్చు చేస్తే రూ.6 ఆదాయం వస్తుందన్నారు. ఎక్కువ కష్టపడాల్సిన అవసరం కూడా ఉండదని చెప్పారు. ఎంత అభివృద్ధి చేస్తే అంత ఆదాయాన్ని రాబట్టొచ్చని వెల్లడించారు. ఎమ్మెల్యే ఛైర్మన్‌గా ప్రతి నియోజకవర్గంలో ఇండిస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. దీపం-2 పథకంలో సమస్యలొస్తే తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణపై ఇప్పటికే ఎమ్మెల్యేలతో మాట్లాడామని, జిల్లా వారీ ఎబిసి కేటగిరీలు పెట్టి జిల్లా, జోన్, స్టేట్ వారీ కమిటీలు వేసి అమలు చేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను పునర్వ్యవస్థీకరణ చేయాల్సి ఉందని అన్నారు. అకౌంటబిలిటీ సెట్ చేసి అన్ని సచివాలయాలను ఇంటిగ్రేట్ చేసి మరింతగా సేవలందించేలా చేస్తామన్నారు. తాను, పవన్‌కల్యాణ్ చెప్పేది ఆచరించాల్సింది ఎమ్మెల్యేలే అని తెలిపారు. 2029లోనూ మీరంతా మళ్లీ ఎమ్మెల్యేలుగా గెలిచి రావాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, బిజెపి పక్ష నేత విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



**చీరాల ఎమ్మెల్యేపై చంద్రబాబు ఆగ్రహం**

ఇసుక విధానంపై మాట్లాడిన చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య యాదవ్‌పై కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇసుక పాలసీలో లోపాలు ఉన్నాయని చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య యాదవ్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో అన్నట్లు తెలిసింది. పాలసీ చదవకుండా మాట్లాడొద్దని మాలకొండయ్యపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మద్యం విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) లేఖలను ఎమ్మెల్యేల కోటా సిఫార్సు లేఖలను 6కు పెంచుతామని గత సమావేశంలో చెప్పారు. ఈ అంశంపై ప్రస్తావించేందుకు ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు ప్రయత్నించగా విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆపి సమాధానం చెప్పారు. ఈ నెల 18న జరిగే టిటిడి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని లోకేష్ అన్నారు. చంద్రబాబే మనకు మార్గదర్శి అని, ఆయన అడుగుజాడల్లో నడావాలని పవన్‌కల్యాణ్ అన్నారు.

# నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్**

**అమరావతి-సూర్యవాస్తవం ప్రత్యేక ప్రతినిధి**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీ కుటుంబాల్లో అర్హత కలిగిన యువతి, యువకులు నైపుణ్యాలు పొంది, జీవనోపాధిని మెరుగుపర్చుకుని తద్వారా జీవన ప్రమాణాలను పెంచుకోవడానికి "ఉన్నతి" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ఉన్నతి కార్యక్రమం కింద ఉచితంగా ఇచ్చే శిక్షణలకు సంబంధించి ఉపాధి హామీ కూలీ కుటుంబాలకు అవగాహన కల్పించి వారిని నైపుణ్యవంతులుగా చేసే బాధ్యత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది తీసుకోవాలని, శిక్షణా కాలంలో వయోజనులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్దేశించిన రోజు కూలీ రూ.300/- చొప్పున 90 రోజులకు గానూ రూ.27,000/- లభిస్తుందని ఈ అవకాశాన్ని వయోజనులందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో 100 రోజుల పని పూర్తి చేసిన కుటుంబాలకు చెందిన వయోజనులు శిక్షణకు అర్హులు. ఉన్నతి సర్వే మొబైల్ యాప్ లో పొందుపరచిన 100 రోజులు పూర్తిచేసిన కుటుంబాలకు చెందిన వయోజనులు ఆశక్తి కనపర్చిన శిక్షణ వివరాలను ఎఫ్.ఎ, టిఎలు సేకరిస్తారు. అనంతరం వారు ఎంచుకున్న వివిధ కోర్సుల్లో సీడాప్- దీన్ దయాల్ ఉపాధ్యాయ్ గ్రామీణ్ కౌశల్య యోజన కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. సంబంధిత జిల్లాకు చెందిన, ఉపాధి హామీ పథకంలో 2019-20 నుంచి ఇప్పటివరకు ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల వయోజనులు, 18-45 సంవత్సరాల మధ్య వయస్కులై పదో తరగతి పాస్ లేదా డిగ్రీ ఫెయిల్ అయిన వారు ఈ శిక్షణకు అర్హులు. ఈ శిక్షణ కాల పరిమితి 90-120 రోజులు ఉంటుంది. కోర్సుకి అవసరమైన లెర్నింగ్ మెటీరియల్, రెండు జతల యూనిఫారం, స్త్రీ పురుషులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పిస్తారు. శిక్షణ సమయంలో వ్యక్తిగత ట్యాబ్ ఉపయోగించుకునే సౌకర్యం, హైస్పీడ్ ఇంటర్నెట్ ఐటి ల్యాబ్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. శిక్షణ అనంతరం ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికేట్,ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారు.

శిక్షణలో భాగంగా మార్కెటింగ్, ఎలక్ట్రికల్ అసెంబ్లింగ్, పిసిబి ఆపరేటర్, ఏరోస్పేస్ ఏవియేషన్, వ్యవసాయం, దుస్తుల తయారీ, హోమ్ ఫర్నిషింగ్, ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ సేవలు, బ్యూటీషియన్ కోర్సులు వంటి 31 రంగాల్లో 215 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. కూలీ కుటుంబాలు దీర్ఘకాలం ఉపాధి హామీ పథకంపైనే ఆధార పడకుండా నైపుణ్యం కల్గిన వృత్తుల్లోకి ప్రవేశించి అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళాలని, అందుకు ఉన్నతి శిక్షణా కార్యక్రమాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఇటు కూలీ కుటుంబాలు అటు ఉపాధి హామీ సిబ్బందిని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కోరారు.





## ఫిబ్రవరి 23న గ్రూప్-2 ప్రధాన పరీక్ష

**అమరావతి-సూర్య వాస్తవం:** గ్రూప్-2 ప్రధాన పరీక్ష వాయిదా పడింది. జనవరి 5న నిర్వహించాల్సిన పరీక్షను ఫిబ్రవరి 23న నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) కార్యదర్శి జె ప్రదీప్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షకు లక్ష మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. జనవరి 5న నిర్వహిస్తామని అక్టోబరు 30న కమిషన్ వెల్లడించింది. అయితే శిక్షణ పొందేందుకు సమయం కావాలని అభ్యర్థులు, యువజన సంఘాల కమిషన్‌ను కోరాయి.

## 71వ అఖిల భారత సహకార వారోత్సవాల గోడ పత్రికలు ఆవిష్కరణ



**చిత్తూరు-సూర్య వాస్తవం:** మంగళ వారం జిల్లా సచివాలయం లోని కలెక్టర్ ఛాంబర్ నందు 71 వ అఖిల భారత సహకార వారోత్సవాలు పురస్కరిం చుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ముద్రించిన గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయండి



**చిత్తూరు-సూర్య వాస్తవం:** బీసీల సంక్షేమానికి బడ్జెట్ లో పెద్ద పీట వేసిన కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్య వాదములు తెలుపుతూ, చిత్తూరు జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, తద్వారా పేద నిరుద్యోగులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని, గతంలో జిల్లా ప్రధాన కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వానికి ఎన్నో సార్లు అడిగిననూ స్పందించలేదని, కావున కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

### - కాణిపాకం ఎస్సై ధరణిధర



**ఐరాల-సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఆదేశాల మేరకు మంగళవారం కాణిపాకం పరిసర ప్రాంతంలో వాహనాలను ఎస్సై ధరణి ధర ఆధ్వర్యంలో తనిఖీ చేయడం జరిగింది.ట్రాఫిక్ చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నట్లు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. మైనర్ల పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల వాహనం నడిపితే యజమాని పై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు.ద్విచక్ర వాహనాలకు సంబంధిత లైసెన్సు తోపాటు రికార్డులు సక్రమంగా ఉండాలని నెంబర్ ప్లేటు ఓవర్ లోడ్ త్రిబుల్ రైడ్ నడిపే వారికి జరిమానా కూడా విధించడం జరిగిందని ఎవరైనా నిబంధనలో అతిక్రమిస్తే వాహనాలను కూడా సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కాణిపాకం ఆలయం వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరిగితే సహించేది లేదని లాడ్జి యజమానుకు హెచ్చరికలు జారీ చేసారు.కావున లాడ్జి యజమానులు తప్పనిసరిగా ఎవరైతే లాడ్జికి వచ్చే యాత్రికుల వద్ద ఆధార్ నెంబరు వారికి సంబంధించిన బయోడేటా ను చెక్ చేసి వాళ్ళకి రూమ్స్ ఇవ్వాలని కోరారు.లేబర్ , అగ్నిమాపక శాఖ ,పంచాయితీ, రెవిన్యూ శాఖల సంబంధించిన అనుమతి రికార్డులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని కొన్ని లాడ్జిలలో రికార్డులు లేనట్లు కూడా గుర్తించడం జరిగిందని అపరిచిత వ్యక్తులకు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారికి లాడ్జిలో రూములు ఇవ్వడం జరిగితే ఎవరైనా లాడ్జి యజమానుల పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై ధరణి ధర తెలిపారు.

# అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలి

**తిరుపతి కలెక్టరేట్ -సూర్య వాస్తవం**



తిరుపతి జిల్లాలో క్యాన్సర్ అనే మహమ్మారి నిర్మూలించుటకు వైద్య అధికారులు సిబ్బంది కలసికట్టుగా బాధ్యత తో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళ వారం సాయంత్రం స్విమ్స్ ఆసుపత్రి ఆడిటోరియం నందు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సునీత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి లతో కలసి ఈ నెల 14 నుండి జిల్లాలో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్లి వివిధ రకాల క్యాన్సర్ పరీక్షల నిర్వహణ పై డాక్టర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినది తెలిపారు. ఈ నెల 14 నుండి జిల్లా లో ప్రతి ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి వివిధ రకాల పరీక్షల నిర్వహించుట కు అన్ని ఏర్పాట్లు చేయాలని డియంహెచ్ఓ ను ఆదేశించారు. జిల్లాలో క్యాన్సర్ అనే మహమ్మారి లేకుండా నిర్మూలించుటకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. ముందు రోజు ఆశ వర్కర్లు వారి కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఇంటింటికి వైద్య సిబ్బంది వచ్చి మీ ఆరోగ్యానికి సంబంధించిన వివిధ రకాల పరీక్షలు నిర్వహించడం జరుగు తుందన్న సమాచారాన్ని ముందుగానే తెలియజేయాలన్నారు. కుటుంబంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి బిపి, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం, బ్రెస్ట్ క్యాన్సర్ మొదలగు వాటికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు సిహెచ్ఓ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రజల తో స్నేహ పూర్వకంగా, ఇష్టంతో నాణ్యతగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఏయన్ యం లు పరీక్షలకు సంబంధించి వ్యాధులను యాప్ లో అప్ లోడు చేయాలని, మెడికల్ ఆఫీసర్లు నిర్ధారణ పరీక్షల్లో వ్యాది నిర్ధారణ అయితే చికిత్స చేయాలన్నారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సూపర్వైజర్ స్టాఫ్ మరియు మెడికల్ ఆఫీసర్లు, మండల స్థాయి డాక్టర్లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. చికిత్స అనంతరం వ్యాధి గ్రస్థుల సంక్రాంగా మందులు వాడుతున్నారా లేదని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే సిమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా గ్రామాలలో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, క్యాన్సర్ ఉన్న వారికి స్విమ్స్ లో వైద్య సేవలు అందయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సిమ్స్ డైరెక్టర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డిఎం అండ్ హెచ్ఓ కాన్సర్ కి సంబంధించిన వివిధ రకాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల్లో వ్యవసాయం చట్టరీత్యా నేరం

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్ -సూర్య వాస్తవం**




అటవీ భూములలో వ్యవసాయం చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఆదవరం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని ఆక్రమణకు గురైన అటవీ భూములు పై కేవిబి పురం మండలం కలత్తూరు గ్రామ రైతులతో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఎఫ్ఓ, సబ్ డిఎఫ్ఓ, ఆర్డిఓ శ్రీకాళహస్తి, పుత్తూరు డిఎస్పి, అగ్రికల్చరల్ అధికారులతో, కేవీబీపురం తహశీల్దారు మరియు కలత్తూరు గ్రామ రైతులు, నాయకులు తో అటవీ, రెవెన్యు భూముల ఆక్రమణలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలత్తూరు భూఆక్రమణలకు సంబంధించి అటవీ ప్రాంత భూములందు వ్యవసాయం చేయడం చట్ట రీత్యా నేరం అని తెలుపుతూ గతంలో రెవిన్యూ భూముల్లో వ్యవసాయం చేసుకునే వారు గతంలో వారికి డి కే టి పట్టాలు ఇవ్వడం జరిగిందని అందులో వ్యవసాయం చేసుకుంటే ఎటువంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. కలత్తూరు గ్రామ రైతులు అటవీ ప్రాంతంలో దాదాపు 30 ఎకరాలలో పంటలు వేసారని మా దృష్టికి వచ్చిందని కాని రైతులు నష్ట పోకూడనే ఉద్దేశ్యంతో వేసిన ఒక పంటను సాగు చేసుకోవడానికి మాత్రమే అనుమతి స్తున్నామని ఈ అటవీ ప్రాంత భూములలో కలత్తూరు గ్రామ రైతులు తిరిగి ఎటువంటి పంటలు వేయరాదని తెలిపారు. ప్రభుత్వ రెవిన్యూ, అటవీ భూములలో వ్యవసాయం చేయాలనీ చూస్తే ఎంతటి వారైనా కటిన చర్యలు ఉంటాయని తెలిపారు. అలాగే 30 సంవత్సరాల నుండి వ్యవసాయం చేసుకుంటున్నామని రైతులు తెలుపగా అందులకు మీరు అక్కడే మూడు తరాల నుండి వ్యసాయం చేస్తున్నామని రుజువులు చూపాలని లేదా సంబందిత రైతులు ఆర్ఓఎఫ్ఆర్ క్రింద దరఖాస్తులు సమర్పిస్తే పరిశీలిస్తామని తెలిపారు. వీటిపై సంబందిత నివేదికలను తాయారు చేసి ప్రభుత్వానికి పంపుటకు తగు చర్యలు తీసుకొనుటకు సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబందిత అధికారులు, కలత్తూరు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి

**తిరుపతి కలెక్టరేట్ -సూర్య వాస్తవం**

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ప్రాజెక్టుల నిర్మాణ కంపెనీ ప్రతినిదులు, స్మార్ట్ సిటీ అధికారులతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగు మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, శ్రీనివాస సేతు పనులపై అఫ్కాన్స్, మల్టి లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ సంస్థల ప్రతినిదులు పనుల పురోగతిపై వివరించారు.




## డీఎస్సీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

**చిత్తూరు-సూర్య వాస్తవం:** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ విజయవాడ సంచాలకులు ఆదేశాల మేరకు, రాబోయే మెగా డీ.ఎస్సీ నోటిఫికేషన్ సంబంధించి అర్హులైన నిరుద్యోగ బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఆంధ్ర ప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, చిత్తూరు నందు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలియజేస్తున్నాం. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000/- లోపు ఉండాలి. టిటిసి మరియు టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులుగా భావించబడతారు. డీ.ఎస్సీ శిక్షణలో సీట్ల కేటాయింపు ప్రకారం, బీసీలకు 66%, ఎస్సీలకు 20%, ఎస్టీలకు 14% సీట్లు కేటాయించ బడతాయి. అదనంగా ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 10% సీట్లు కేటాయించాం. ఈ శిక్షణ రెండు నెలలు పాటు ఉంటుంది, సదరు శిక్షణ కాలంలో 75% హాజరు ఉన్న ప్రతి అభ్యర్థికి నెలకు రూ.1500/- స్టైపెండ్ మరియు మెటీరియల్ కోసం రూ.1000/- అందజేస్తామని తెలియజేస్తున్నాం.

**దరఖాస్తు విధానం :**

బి.ఇడి పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ప్రొవిజినల్ సర్టిఫికేట్, 10వ తరగతి, ఇంటర్ మరియు డిగ్రీ మార్క్‌లిస్టులు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (వార్షిక ఆదాయం రూ.1,00,000/- లోపు మాత్రమే), ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ మరియు 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి, డీ.ఎస్సీ అభ్యర్థులు తమ దరఖాస్తులను 15.11.2024 తేది లోపు అందజేయవలెను.

**దరఖాస్తులు సమర్పించవలసిన చిరునామా :**

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి వారి కార్యాలయము, మొదటి అంతస్తు, అంబేద్కర్ భవన్, కొత్త కలెక్టరేట్, చిత్తూరు, పిన్ కోడ్-517002.

**ఇతర వివరముల కొరకు :** టి. ప్రేమ్, సీనియర్ అసిస్టెంట్ సెల్ నం : 9177429494 మరియు జె.శ్రీనివాసులు సూపరింటెండెంట్ సెల్ నం : 8520004646 వారిని మరియు కార్యాలయపు మెయిల్ ఐడి dbcweo.ctr.20@gmail.com సంప్రదించగలరు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

## రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించండి



**చిత్తూరు-సూర్య వాస్తవం:** రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించే వరకు కాంట్రాక్టర్ ను పనులు చేయనీయబోమని బండి వాండ్ల ఊరు రైతులు తెలిపారు. యాదమరి మండలం, బండి వాండ్ల ఊరు గ్రామ పరిధిలో 400 కెవి హై విద్యుత్తు లైను భూ నిర్వాసితుల తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదమరి మండలం, బండి వాళ్ళ ఊరు పరిసర గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ధర్నాకు పూనుకున్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు బాబు, భూషణ్ నాయుడు ఆధ్వర్యంలో రైతులు పొలాల్లో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కొబ్బరి, మామిడి భూములకు కర్ణాటక, తమిళనాడు తరహా ఇక్కడ రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే విద్యుత్తు లైను ఏర్పాటు పనులను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తగిన నష్టపరిహారం చెల్లించుకుంటే ఎట్టి పరిస్థితులను విద్యుత్తు లైను ఏర్పాటు పనులను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కాంట్రాక్టర్ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమిళనాడు, కర్ణాటకలో ఎక్కువ మొత్తంలో నష్ట పరిహారం అందించిన కాంట్రాక్టర్ ఎనిమిది వేల రూపాయలు అందించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. బండి వాళ్ళ ఊరు, కోడిగుట్ట, పుల్లయ్య గారి పల్లి గ్రామాలకు చెందిన 50 మంది రైతులు భూముల కోల్పోతున్నారని తమకు న్యాయపరమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాత పనులు చేయాలని కాంట్రాక్టర్లను కోరితే తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. బండి వాళ్ళ ఊరు కోడిగుట్ట గ్రామాలకు చెందిన కృష్ణమూర్తి నాయుడు, సుబ్బరాయుడు, నరసింహనాయుడు, జనార్ధన్ నాయుడు, గోవర్ధన్ నాయుడు, బాబు, శివలింగం, శేఖర్, చంద్ర పాల్గొన్నారు.

## అత్యుత్తమంగా క్రీడా రంగాన్ని అభివృద్ధి చేస్తాం

**విజయవాడ-సూర్య వాస్తవం**



దేశంలోనే అత్యుత్తమంగా క్రీడా రంగాన్ని అభివృద్ధి పరిచే విధానాన్ని తీసుకొచ్చామని, అంతే చిత్తశుద్ధితో ఆ విధానాన్ని అమలు చేస్తామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హేమ భారదరావు శాప్ ఛైర్మన్ రవినాయుడిని మంగళవారం కలిశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ఆమోదించిన స్పోర్ట్స్ విధానం పట్ల భారదరావు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ క్రీడారంగాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం పలు అంశాలపై వారిరువురూ చర్చించారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ సీఎం ఆశయాలకు అనుగుణంగా ఏపీని క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. క్రీడావసతుల కల్పనే లక్ష్యంగా శాప్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు భారదరావును శాప్ ఛైర్మన్ దుశ్శాలువాతో సత్కరించారు.

## యువ ఉత్సవ్ విజయవంతం చేయండి

- ప్రిన్సిపల్ విష్ణు వర్ధన్




**పులివెందుల - సూర్య వాస్తవం ప్రతినిధి:** పట్టణం లోని జె ఎన్ టీ యూ కళాశాల లో యువ ఉత్సవ్ 2024 ప్రమోట్ చేయడంలో భాగంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ విష్ణు వర్ధన్, నెహ్రూ యువ కేంద్రం, వాలంటీర్ అరవింద్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ ల చేతులమీదుగా గోడ పత్రాలు విడుదల చేశారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16 న కడప యోగి వేమన యూనివర్సిటీలో యువ ఉత్సవ్ లో భాగంగా నిర్వహిస్తున్న ఇండియా 2047 పోటీలు చిత్రలేఖనం, కవితా రచన, మొబైల్ ఫోటోగ్రఫీ, డిక్లమేషన్, సాంస్కృతిక ప్రదర్శనలు, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి విభాగాలలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే అవకాశ ముంటుంది. కావున 15 సంవత్సరాలు నిండిన యువత పోటీలలో పాల్గొని యువ ఉత్సవ్ పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## గౌరీమాతకు పూజలు



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** స్థానిక పాత మార్కెట్ లో వున్న లలితా దేవి రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో మంగళవారం కార్తీక మంగళవారం సందర్భంగా గౌరీమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ మూలవిరాట్టులైన లలితా దేవి, రతనాల వెంకటేశ్వర స్వామి, శివ పార్వతీ మాతకు ప్రత్యేక గో క్షీర, పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం గౌరీమాతకు పూజలు నిర్వహించి, మహా నివేదనం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## కార్తీక మాసంలో ఉసిరి చెట్టు నీడన భోజనాలు



**వీరబల్లి - సూర్య వాస్తవం:** కార్తీక మాసంలో ఎంతో పవిత్రమైనదిగా పూజించే ఉసిరి చెట్టు కింద ఒక్క పూట అయినా భోజనం చేయాలన్నదే హైందవ సంప్రదాయంగా భావిస్తారు. స్థానిక షిర్డీ సాయి మందిరంలో రిటైర్డ్ టీచర్ మల్లేష్ ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఉసిరి చెట్టు మొదలు దగ్గర విష్ణు మూర్తి చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. భక్తులందరు ఉసిరి చెట్టు కింద భోజనాలు చేశారు. అలా చేయడం వల్ల పాపాలాన్ని తొలగిపోతాయని భక్తుల నమ్మకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి, మధు సూదన్ రెడ్డి, శేఖర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఎర్రిస్వామి, గుప్తా, రామాంజులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్‌పై ఎస్సారైటీలో సెమినార్




**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** మండలంలోని లింగాపురం గ్రామంలోని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫైనలియర్ ఈఈఈ విద్యార్థులకు ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ అనే అంశంపై హెచ్ఓడి డాక్టర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో సెమివార్ నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఫైనలియర్ బిటెక్ ఈఈఈ నుండి 9 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారిచే డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ అంశం పై ఆధునిక విధానాలను ప్రజంటేషన్ ఇప్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎస్.సి.ఏ.డి.ఏ, పి ఎల్ సి ఉపయోగించి మానవ రహిత డిస్ట్రిబ్యూషన్ కుట్రోల్ చేసే పలు విషయాలను ప్రజెంట్ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీర కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.

## నూతనంగా అంగన్వాడీ, ఆయా వర్కర్ల యూనియన్




**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు సెక్టార్ల లీడర్ల సమావేశం మంగళ వారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ, ఆయా వర్కర్ల యూనియన్ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి సూచనల మేరకు ఏర్పాటు చేశారు. అంగన్వాడీ గౌరవ సలహాదారుగా మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, అంగన్వాడీ గౌరవ అధ్యక్షుడిగా ఘంటసాల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ అధ్యక్షురాలిగా బోగా శివ కల్యాణి, కార్యదర్శిగా కల్పన, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, నాయకులు నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, 8 సెక్టార్ల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరవు మండలాలను ప్రకటించాలి




**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** కడప జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని ఏపీ రైతు సంఘం పిలువు నిచ్చింది. నవంబర్ 14న కడప కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను జయప్రదం చేయాలని చింతకొమ్మదిన్నె లో గోడపత్రికలను ఆవిష్కరించిన ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 14న కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కడప జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహా ధర్నా జయ ప్రధం కోసం చింతకొమ్మదిన్నె మండల తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో ఖరీఫ్ సీజన్లో తీవ్రమైన కరువు నెలకొన్నదని రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ జిల్లాలలో 54 కరువు మండలాలుగా ప్రకటించారని కడప జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు మండలం ప్రకటించకపోవడం చాలా అన్యాయమని ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్లో పత్తి వేరుశనగ కంది మినిము పెసర ఉద్యానవన పంటలకు వర్షం రాకపోవడంతో పంట నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ పెట్టుబడి సహాయం 20 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి పెండింగ్లో ఉన్న గాలేరు నగరి కాలువను పూర్తి చేసి కరువు రైతాంగాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ నేపథ్యంలో ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారాలు మోప డం చాలా దుర్మార్గకరమని ఆయన తెలిపారు. గోడపత్రికలో ఆవిష్కరణ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య నాయకులు శ్రీనివాసులురెడ్డి చిన్న సిద్ధయ్య రమణ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దనే ఉచిత వైద్య పరీక్షలు



**దువ్వూరు - సూర్య వాస్తవం:** ఈ నెల 14 వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు దువ్వూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ హేమలత, చింతకుంట ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వికసిత, డాక్టర్ రోషిణి లు పేర్కొన్నారు. మంగళవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ సురేష్ బాబు డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో అలాగే చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో డాక్టర్ వికసిత, డాక్టర్ రోషిణిల ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని సిహెచ్ ఓ లు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు వయసు దాటిన వారి వివరాలను ఎన్.సి.డి 3.0 సర్వే నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. అందులో బిపి, షుగర్, మరియు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, అలాగే గర్భాశయం ముఖ క్యాన్సర్ సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జబ్బు రాకముందే జాగ్రత్త పడాలి, క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి, క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యమనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించినట్లు డాక్టర్లు తెలిపారు. జబ్బు రాకముందే జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచించారు. ఈ నెల 14 వ తేదీ నుంచి అనగా రేపు గురువారం నుంచి ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేస్తామని ప్రజలకు అవగాహన కల్పించారు. మీ ఇంటి దగ్గరికి వచ్చిన వైద్య సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్లు ప్రజలకు సూచించారు. అందరికీ క్యాన్సర్ పరీక్షలు, ముందస్తు పరీక్ష - క్యాన్సర్ నుండి రక్ష అనే నిదానంతో ముందుకెల్దామని డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు చంద్రమౌళి, ఆరోగ్య విస్తరణ అధికారి రాజగోపాల్, సిహెచ్ఓ విజయ్ కుమారి, సూపర్వైజర్ మేరీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు




**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** సమస్యలు పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నారని తహసిల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కుర్నూతుల అగ్రహారం సచివాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల యువ నాయకుడు యనమల మదన్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నారని, ప్రజల నుండి భూ సమస్యలు ఉన్నవారి నుండి రెవెన్యూ అధికారులు అర్జీలు స్వీకరించి గ్రామాలలో ఉన్నటువంటి రీ సర్వే తప్పులను, జాయింట్ నెంబర్లను, రెవెన్యూ సిబ్బంది సర్వేయర్ తో కలిసి మీ వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం మండల యువ నాయకుడు యనమల మదనమోహన్ మాట్లాడుతూ గ్రామాలలో భూమి సర్వే సమయంలో భూమి కొలతలు తక్కువగా ఉన్న,ఒకరు భూమి మరొకరికి పోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అలాంటి సమస్య పరిష్కారం కోసమే గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాంటి సమస్య ఉన్నవారు గ్రామసభలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలిపారు.గ్రామ సభలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని తాసిల్దార్ ను కోరారు.ప్రజలు భూ సమస్యల కొరకు ఎంతో ప్రయాసతో అధికారుల వద్దకు వస్తారని వారి సమస్యను సావిదానంగా విని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మదన, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, తెలుగుదేశం పార్టీ నాయకులు రామాంజనేయులు, ఓబుల్ రెడ్డి, శివారెడ్డి, మోహన్, వెంకటరామిరెడ్డి, రమణ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ప్రొద్దుటూరు లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో స్థానిక నెహ్రూ రోడ్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జన్మదిన వేడుకలను మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు నంద్యాల ఆనంద భార్గవరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు తదితరులు కేక్ ను కట్ చేసి కార్యకర్తలకు పంచారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆధ్వర్యంలో శాసనసభ్యులు నంద్యాల వరదరాజులరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం గోపవరం కార్యకర్తలతో కలసి రాష్ట్ర శాసనసభ సమావేశాలకు వెళ్ళిన సందర్భంగా ఆయన తరపున కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, యువ నాయకులు బచ్చల వీరప్రతాప్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి శ్రీను, డీలర్ శ్రీను, కుళ్ళు శ్రీను, సుధాకర్, అంగడి శ్రీను, రమణ సుమంత్ గురివిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు టిడిపి నాయకులు కామిశెట్టి బాబు, మండలంలోని దొరసానిపల్లె గ్రామానికి చెందిన మాడెం సుధాకర్ రెడ్డి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. **రక్తదానం:** ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం టిడిపి నాయకులు బోనం గురివి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు, ఐదు మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో మూలవారిపల్లె బాలయ్య, పొట్టి పార్టీ సురేష్, శివ, ప్రేమ్, తరుణ్ శ్యామ్, రక్తదానం చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్డెంట్ ఆనందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అభిమాని ఖాజా ఆధ్వర్యంలో అన్నదానం:** ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయన అభిమాని దొమ్మర నంద్యాల ఖాజా ఆధ్వర్యంలో స్థానిక విజయేశ్వరి వృద్ధాశ్రమం అన్నదానాన్ని నిర్వహించి తన అభిమానాన్ని చాటుకున్నారు.

# ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య - సూర్య వాస్తవం:** ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. పుల్లంపేట మండలం ఎంపీడీవో కార్యాలయాన్ని, ఓబులవారిపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేసి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులు, పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చే అర్జీలు, రెవెన్యూ సమస్యలు, ఎన్టీఆర్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలుతదితరులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీదారులు ఇచ్చిన సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులను ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడీల జనరేషన్ కు సంబంధించి మాట్లాడుతూ... ఎంఈఓ లు ఎంపీడీవోలు సమన్వయంతో త్వరగా జనరేట్ చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ.... హౌసింగ్ శాఖ వారు మరియు ఎంపీడీవోలు సమన్వయం చేసుకొని పురోగతి సాధించాలన్నారు. సమీక్ష అనంతరం... పుల్లంపేట మండలం, దేవసముద్రం గ్రామం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఒక భూ సమస్య పరిష్కారం కోసం రాజంపేట ఇన్చార్జి ఆర్ డి ఓ, పుల్లంపేట తాసిల్దార్లతో కలిసి సమస్య క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి అధికారులకు తగు సూచనలను చేశారు. ఈ సమీక్ష సమావేశాలలో రాజంపేట ఇన్చార్జి ఆర్డీవో లీలారాణి, పుల్లంపేట, ఓబులవారిపల్లి మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, భూ సర్వే శాఖ ఏడి భరత్, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు సాగుసాయం అందించాలి




**మైదుకూరు - సూర్య వాస్తవం:** సాగు సాయం 20వేల రూపాయలను రాష్ట్రంలోని రైతులకు, కౌలు రైతులకు వెంటనే అందించాలి.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వైయస్సార్ కడప జిల్లా సమితిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రైతుల సమస్యలను పరిష్కరించవలెనని చాపాడు మండల తహసిల్దార్ రమా కుమారికి రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, భారత కమ్యూనిస్టు సిపిఐ జిల్లా సమితి సభ్యులు పల్లవోలు రమణ, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు కదిరేపల్లి రామాంజనేయులు, రైతులతో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా రైతు సంఘం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని రైతులు, కౌలు రైతులందరికీ సాగు సాయం 20వేల రూపాయలను ఈ రబీ సీజన్ లో అయినా అందించాలని, 2014 - 2019 నాటి ముఖ్యమంత్రి, నేటి ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబునాయుడు గారు ఆనాడు చేసిన రుణమాఫీలో 4వ విడత, ఐదవ విడత రుణమాఫీ రైతులకు కానందున నాలుగో విడత, ఐదవ విడత రుణమాఫీని చేసి రైతులను ఈ ప్రభుత్వం ఆదుకోవాలని, రబీ సీజన్ లో రైతులు సాగు చేస్తున్న పంటలన్నింటికీ ప్రభుత్వమే బీమా రుసుము చెల్లించాలని, కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణకు రాజోలి రిజర్వాయర్ను వెంటనే పనులు ప్రారంభించి నిర్మించవలెనని, మైదుకూరు కేంద్రంగా కెపి ఉల్లి శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, 75 కేజీల వరి బస్తా ధాన్యాన్ని 3000 రూపాయలు తక్కువ కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయవలెనని, చెన్నూరు సుగర్ ఫ్యాక్టరీని, ప్రొద్దుటూరు పాల కేంద్రాన్ని పునరుద్ధరించవలెనని, ఎరువులు, పురుగుమందులను సబ్సిడీ ధరతో రైతులకు రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వమే అందించవలెనని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, పంట కాలువలను పూర్తి చేసి ఆయా ప్రాజెక్టుల కింద రైతుల భూములకు సాగునీరు అందించవలెనని, రాష్ట్ర విభజన హామీల లో భాగంగా కడప జిల్లాలో భారీ ఇనుము ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావాలి, కర్నూలు జిల్లాలో యురేనియం కర్మాగార నిర్మాణ ప్రయత్నాలను అక్కడి రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే నిలిపి వేయవలెనని, రైతాంగ సమస్యలను పరిష్కరించని పక్షంలో, డిమాండ్లను నెరవేర్చనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాపాడు మండలానికి చెందిన రైతులు కే.వెంకటేశ్వర్లు, ఎం. రామచంద్రుడు, బి.సుబ్బయ్య పాల్గొనడం జరిగింది.

# ఆశా కార్యకర్తలపై వైద్యాధికారి వేధింపులు



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** ఆశా వర్కర్స్‌కు సంబంధం లేని పనులు చేయించడమే కాకుండా, ఆశా కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్న సిటియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీలక్ష్మి, సిహెచ్ఓ అరుణ, సూపర్ వైజర్ సుమతి లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సిటియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు రోజువారీ ఓపి (అవుట్ పేషెంట్) విభాగం నందు డ్యూటీలు వేయడం, వారికీ సంబంధం లేని పనులు చేపించడం, వేధింపులకు పాల్పడటం లాంటి చర్యలకు నిరసనగా మంగళవారం పి హెచ్ సి ముందు ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఓపి డ్యూటీ రద్దు చెయ్యాలని, వేధింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని, ఆశావర్కర్స్ కు పనిభారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆన్లైన్ వర్క్స్ భారాన్ని తగ్గించాలని, ఆన్లైన్ లేదా రికార్డ్స్ వర్క్స్ ఏదైనా ఒకపని ఒక్కసారి మాత్రమే చేయించాలని, అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు ధర్నాకు హాజరైతే మెమోలు ఇస్తామని అధికారులు బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు. 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారని, సిబ్బంది. చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి, వేధించి ఆశాలతో చేయిస్తున్నారని అందులో భాగంగానే పిహెచ్సిలో ఓపి డ్యూటీ లు చేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆన్ లైన్ వర్క్స్ తో పాటు సొంత డబ్బులుతో 26 రకాల రికార్డ్స్ కొని వ్రాయాలని హింసిస్తున్నారని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలలో రోజంతా కూర్చోబెట్టడం, రిజిస్టర్ లో సంతకాలు చేయాలని, మిగిలిన సమయంలో ఫీల్డ్ లోకి వెళ్లాలని ఎన్.హెచ్.ఎమ్ నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తూ ఆశాలను తీవ్రమైన ఒత్తిడికి అధికారులు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటియం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలతో అడ్డమైన చాకిరీ చేయిస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడికి తట్టుకోలేక ఆశావర్కర్స్ తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వ సెలవులు లేని కారణంగా ఆశావర్కర్ కు ఒక్కరోజు లేదా ఒక గంట పర్మిషన్ కోసం అధికారులు దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని అన్నారు. సచివాలయాలు, ఉప కేంద్రాలలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు కూర్చోబెట్టడం ఆపాలని, రిజిస్టర్ లో ప్రతిరోజు సంతకాలు చేయటం ఆపాలని, పి.హెచ్.సికి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఏ, డిఏ లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. లెప్రసీ సర్వే కు చెల్లించాల్సిన పారితోషికాలు గత మూడు సంవత్సరాలుగా బకాయిలు ఉన్నా అధికారులు పట్టించుకోలేదని, దీని మీద సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలకు న్యాయం చెయ్యకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ విమలకృప వివరణ ఇస్తూ ఆశాలకు ఓపి డ్యూటీలు వెయ్యడం పొరపాటని, గతంలో అలా చేసినందుకు క్షమాపణలు చెబుతూ ఇక నుంచి వెయ్యమని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రామామణి, గాయత్రి, ప్రసన్న, రమాదేవి, అమరావతి, పార్వతీ, బాలకుమారి, జానకి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** మండలంలోని దొరసానిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సిసి రోడ్ల నిర్మాణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు డిఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఈ గణేష్, సైట్ ఇంజనీర్ శాంతయ్య, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, బోనం, గురి విరెడ్డి, బోనం యేసు రత్నం, జి.భూషణం, బి.ప్రభుదాస్, బి.గాబ్రి యేలు, గోపాల్ దాస్, కృపాకర్, జి.స్వరూప్, జమ ఆర్, పి.భరత్, మధు, జి.ఇమ్మానుయేలు, బి.బాబు, బి.రాజేంద్ర ప్రసాద, బి, ఏషేపు, పందిటి రాజేష్, ఆర్ మేరీ బాబు, పాల్గొన్నారు.

## సీఎం చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**రాయచోటి - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని దఫేదార్ పల్లె ఉర్దూ కళాశాల లో ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న షౌకత్ కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ అవార్డు ను విజయవాడ నగరంలోని ఎన్ - కన్వెన్షన్ సెంటర్ లోసోమ వారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగాముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకు న్నారు. ఈ సందర్భం గా షౌకత్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం నాకు ఎంతో సంతోషం గా ఉన్నా పాఠశాల విద్యార్థుల పట్ల బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ అవార్డు రావడానికి సహకరిం చిన విద్యాశాఖ జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. షౌకత్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో పలువురు ఉపాధ్యాయులు, మిత్రులు, స్థానికులు, హర్షం వ్యక్తం చేశారు.

## టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** తెలుగుదేశంపార్టీ సభ్యత్వం తీసుకోవడంతో పలు ఉపయోగాలున్నాయని భీమా సౌకర్యంతో పాటు కుటుంబాలకు తగిన సహాయాలు తెలుగుదేశంపార్టీ అందిస్తుందని ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేస్తూ మంగళవారంనాడు దొరసానిపల్లి సర్పంచ్ ఈశ్వరమ్మ, భర్త అరవ మునివర స్థానిక నాయకులు సభ్యత్వ నమోదాలు చేయించారు.

## మహాలక్ష్మి దేవి అలంకారంతో గౌరీదేవి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గౌరీ దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు కుంకుమార్చన తదితర పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయ దారుల పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఐదు రోజులపాటు కార్తీక మాస మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రెసిడెంట్లు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ప్రెసిడెంట్లు కొత్తూరు రెడ్డయ్య, ఆరుశేర్ల రంగయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** 57 వ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయాధికారి ఆర్.వసంత కుమారి తెలిపారు. ఈ మేరకు గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలను మదనపల్లె ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర, ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, కమిషనర్ ప్రమీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జరుగుతాయని ఇందులో భాగంగా బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు.15వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహిస్తామన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ, క్విజ్, క్రీడల పోటీలు నిర్వహణ,19 వ తేదీన మహిళలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 20వతేదీన డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ,క్రిష్ణమూర్తి, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్‌లో సైన్స్ పుస్తకావిష్కరణ




**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** స్థానిక ఉప విద్యాశాఖ అధికారి కార్యా లయంలో మంగళవారం సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కె. చంద్రశేఖర్, బి. శివలక్ష్మి 10 వ తరగతి స్లో లెర్నర్స్ కోసం తయారు చేసిన టార్గెట్ పిజిక్స్ అండ్ బయాలజీ పుస్తకాలను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్, గోపీనాథ రెడ్డి, క్లబ్ జిల్లా కన్వీనర్ విజయ మోహన్ రెడ్డి, ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు వంశీకృష్ణ, కార్యదర్శి అల్లా బకష్ పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డు పై విద్యార్థుల దాడి



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** సెక్యూరిటీ గార్డు పై ఇంజనీరింగ్ విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన మంగళవారం కురబలకోట మండలం లో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల స్థానికంగా ఉన్న శ్రీకాంత్ అనే వ్యక్తి సెక్యూరిటీ చేరాడు. ఆ కళాశాలలో చదివే కొందరు విద్యార్థులు గతంలో మాదిరిగా తమను స్వేచ్ఛగా బయటకు పంపివ్వడం లేదని శ్రీకాంత్ పై కక్ష్య కట్టారు. అతని వల్ల ఇబ్బంది పడుతున్న విద్యార్థులు ఏకమై సెక్యూరిటీ గార్డు పై మూకుమ్మడి దాడి చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని దాడికి పాల్పడ్డ విద్యార్థులపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## కరెంట్ షాక్‌తో కార్పెంటర్ పరిస్థితి విషమం



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** కరెంట్ షాక్ కొట్టడంతో ఓ కార్పెంటర్ పరిస్థితి విషమంచిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలం గార బురుజు గొల్లపల్లి కు చెందిన కార్పెంటర్ చెన్నకేశవ(25) రోజు మాదిరిగానే భవన నిర్మాణ పనులు చేయడానికి మదనపల్లికి వచ్చాడు. స్థానిక గొల్లపల్లి రింగ్ రోడ్డు వద్ద భవన నిర్మాణం పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఏర్పడి కాలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రధమ చికిత్సలు అందించారు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్లు సూచించారు. కుటుంబ సభ్యులు బాధితుని తిరుపతికి తరలించారు కేసు దర్యాప్తులో ఉందని రెండవ పట్టణ పోలీసులు తెలిపారు.

## కొమ్మ విరిగి పడి అయ్యప్ప భక్తుడికి తీవ్ర గాయాలు



**మదనపల్లి క్రైమ్ - సూర్య వాస్తవం:** కొమ్మ విరిగి మీద పడి అయ్యప్ప భక్తుడు తీవ్రంగా రేపటి సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లి లో జరిగింది. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వలసపల్లి గ్రామం, మొలకల దీన్నే కొచ్చిందిన పవన్ (23) అయ్యప్ప స్వామి మాలను ధరించి దీక్షలో ఉన్నాడు. స్థానిక బసనకోండలోని శివాలయం వద్దకు వస్తుండగా, మార్గమధ్యంలోని బస్సునికొండ డిఎస్పి బంగ్లా సమీపాన రోడ్డు పక్కన నిలబడి ఉన్న పవన్ పై గాలికి చెట్టు కొమ్మ విరిగి మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు.

## ప్రమాదవశాత్తు బావిలో జారిపడి యువకుడి మృతి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మండలంలోని కస్తూరి రాజు గారి పల్లి గ్రామం గురవయ్య గారి పల్లికి చెందిన వెంకటేష్ (28) అనే యువకుడు పల్లెకు సమీపంలోని పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు దగ్గర్లో ఉన్న బావిలోకి జారి పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో ఎస్ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో కలిసి మృతుడి భౌతిక గాయాన్ని పోస్టుమార్టం కొరకు లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వివాహ వేడుకల్లో రెడ్యం సోదరులు



**మైదుకూరు - సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కట్టమీద మదుసూదనరెడ్డి ప్రథమ పుత్రిక వ మనీషారెడ్డి, చి.సాయి కుమార్ రెడ్డిల వివాహ విందు రిసెప్షన్ ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీదేవిప్యాలెస్ లో జరిగింది. పై రిసెప్షన్ వేడుకల్లో వైఎస్సార్ సిపీ నేత, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సిపీ నేత, కె.సి కెనాల్ ప్రాజెక్ట్ వైస్-చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, వైసిపీ మండల నేత, రెడ్యం ఆదినారాయణ రెడ్డిలు పాల్గని కాబోయే నూతన వదూవరులు కలకాలం చూడముచ్చటైన జంటగా ఉంగాలని అక్షంతలు చల్లి దీవించారు.

# పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలి




**చెన్నూరు - సూర్య వాస్తవం:** మండలంలో స్వచ్ఛభారత్ కు సంబంధించిన పనితీరు బాగుందని, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించడంలో గ్రామపంచాయతీ అధికారులు సఫలీకృతులయ్యారని జడ్పీ సీఈవో ఓబులమ్మ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ లను, గ్రామ సచివాలయాలను సందర్శించారు ఈ సందర్భంగా ఆమె అక్కడ రికార్డులను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని, అన్ని గ్రామ పంచాయతీలలో ఎక్కడ ఏ సమస్య ఉన్న అక్కడికి వెళ్లి పరిశీలించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాశులను గుర్తించి వారికి విద్య బోధన అందించాలి - ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో నిరక్షరాశులను గుర్తించి వారికి విద్యా బోధన అందించాలని ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డిలు అన్నారు. మంగళవారం స్థానిక మండల సభ భవనంలో అంగన్వాడీ కార్యకర్తలకు, డ్వాక్రా మహిళలకు ఏర్పాటుచేసిన ఉల్లాస్ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గ్రామాలలో మీ పరిధిలోని 15 సంవత్సరాలు నుండి 60 సంవత్సరాల లోపు నిరక్షరాశులను గుర్తించి వారికి విద్యాభ్యాసాన్ని అందించాలని కోరారు, ముఖ్యంగా మహిళలలో మంచి పరిజ్ఞానం ఉంటుందని అలాంటప్పుడు వారికి అక్షర జ్ఞానం నేర్పినట్లైతే మరింత ప్రోత్సహించిన వారం అవుతామని వారు తెలిపారు. వైయజనులకు విద్యాభ్యాసం అందించేందుకు మీ మీ దగ్గరలో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో వారికి విద్యాభ్యాసం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి




**రాయచోటి - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లాలో 71 వ అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ జిల్లా సహకార శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో 71 వ అఖిల భారత సహకార వారోత్సవాల వాల్ పోస్టర్లను సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు నిర్వహించు కోబోతున్నామని, వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. నవంబర్ 14 న సహకార మంత్రిత్వ శాఖ యొక్క కొత్త కార్యక్రమాల ద్వారా సహకార సంఘాల బలోపేతం చేయు కార్యక్రమాలు,15 న సహకార సంఘాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన కార్యక్రమాలు, 16 న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన మరియు నైపుణ్య అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17 న సహకార సంఘాలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం చెందే కార్యక్రమాలు, 18 న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలు, 19 న మహిళలు, యువత, బలహీన వర్గాల కొరకు సహకార సంఘాల కార్యక్రమాలు, 20 న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణములో సహకార సంఘాల పాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** రహదారి భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని వాహనదారులకు మదనపల్లె మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ (ఎంవిఐ) శివలింగయ్య సూచించారు. మంగళవారం బెంగళూరు రోడ్డులో తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎంవిఐ శివలింగయ్య మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తగుజాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి వాహనానికి రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఉపయోగించాలని, వాహనాలు నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడకూడదని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఆర్టీఓ కార్యాలయం ద్వారా పలుమార్లు అవగాహన కల్పించడాన్ని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** మదనపల్లె క్లస్టర్ పరిధిలోని మదనపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో ఏపీడి గోకులం నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీడి మధుబాబు పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లి పట్టణంలోని సిఎల్ఆర్సి భవనంలో గోకులం షెడ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో కల్పించిన గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేసి తద్వారా పశు పోషణాభివృద్ధితో పాలను డైరీలకు విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి పొందాలని ఆకాంక్షించారు. రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా రాయితీతో కల్పించిన షెడ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా పూర్తి చేయకపోతే ప్రభుత్వం ఇచ్చే రాయితీ రద్దవుతుందని హెచ్చరించారు. కావున రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాయితీ షెడ్లను నిర్మించుకొని, తద్వారా ఆర్థిక అభివృద్ధి పొందాలని తెలియజేశారు. ఈ సమావేశంలో మదనపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది

**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** మండలంలోని నరసన్న పల్లి, రసూల్ పల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.ఈశ్వరెడ్డి రబి 2024 - 25 సంవత్సరానికి గాను పంటల బీమా ప్రీమియం ఇకమీదట రైతులే చెల్లించవలసి ఉంటుందని అంతేకాకుండా ప్రతి రైతు పంటల బీమా చేయాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మరియు ఈ అవకాశం డిసెంబర్ 15 వరకు మాత్రమే ఉంటుందని తెలియజేశారు మరియు మినుము పంట పూత దశలో ఉన్నది కావున 13 0 45 10 గ్రాములు లీటర్ నీటికి మరియు తయోడికార్బ్ రెండు గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి గారు బోర్లు ఉన్న రైతులు డ్రిప్పు స్రింకర్లు రాయితీ మీద పెట్టుకోవచ్చని రైతులకు తెలియజేశారు. డ్రిప్పు 5 ఎకరాలు లోపు ఉన్న రైతులకు 90% సబ్సిడీ 5 కన్నా ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీ, స్ప్రింక్లర్లు 50% రాయితీ మీద ఇవ్వడం జరుగుతుంది. కావలసినవారు ఆర్ఎస్కె పరిధిలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను కలిసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్చార్జి నీలకంఠ గారు వెట్టి పుచ్చ కషాయాలు తయారీ విధానం దాని ఉపయోగాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, శ్రావణి, నీలకంఠారెడ్డి, రైతులు పాల్గొన్నారు.




# వరిలో ఆకు ముడత పురుగు నివారణ చర్యలు

**దువ్వూరు - సూర్య వాస్తవం:** వరిలో ఆకు ముడత పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఇడమడక గ్రామంలో రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరులో ఆకుముడత ఆశించి ఉన్నదని దాని నివారణ చర్యలు తెలియజేశారు. అధిక మోతాదులో నత్రజనిరులు వాడరాదని తొలి దశలో కొనలు తుంచినాడటం వల్ల పురుగు యొక్క గుడ్డును నివారించవచ్చునని ఏవో తెలిపారు .అలాగే మొదటి పిచికారిలో వేప నూనె 1000 పిపిఎం ఐదు ఎం.ఎల్ కలిపి పైరు పైన పిచికారి చేసుకోవాలని అలా చేసుకునే ఎడల ఆకు ముడత పురుగు గుడ్డు ను నివారించవచ్చును ప్రస్తుతం విస్తృతంగా పురుగు పైరు పైన ఆశించి ఉన్నది కావున ఫ్లూ బెండమయిడ్ 1.5, 13: 0 : 45, 5 గ్రాములు పిచికారి చేయాలి అలాగే జొన్న మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు కూడా తెలియజేశారు. రబీ పంటలకు గాను వేరుశనగ, సెనగ, జొన్న, ఎండకారు వరి, నువ్వులు, పెసర, మినుము, ప్రొద్దుతిరుగుడు పంటల బీమా చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించు ఉన్నది. రైతులు ఆయా పంటలు సాగుచేసినచో పంటల బీమా మీ దగ్గరలో ఉన్న మీసేవ, సిఎస్సి సెంటర్ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు దగ్గర నమోదు చేసుకోవచ్చునుఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ఉద్యాన సహాయకులు సుబ్బిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.




# రైతు భరోసా మాటే లేని రాష్ట్ర బడ్జెట్

**మైదుకూరు - సూర్య వాస్తవం:** రైతు భరోసా మాటే లేని రాష్ట్ర బడ్జెట్.ఏవి.రమణ. అసెంబ్లీలో నిన్న ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక బడ్జెట్లో రైతు భరోసా మాటే లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 2014 నుంచి 19 వరకు ఐదు సంవత్సరాల పాలనలో రైతులను ఏ విధంగా మోసం చేశారో మరోసారి అదేవిధంగా పాలన కొనసాగిస్తున్నారని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవి.రమణ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ, మండల నాయకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబుపాలన మొదలై ఐదు నెలలైనా రైతులకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన రైతు భరోసా 20వేల హామీ పైన ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడం నిన్నటి బడ్జెట్లో కూడా ఆ ప్రస్తావన లేకపోవడం చూస్తే రైతుకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చే అవకాశం లేనట్లు ఉందని అలాగే పెండింగ్ ప్రాజెక్టులు నూతన ప్రాజెక్టుల పైన కూడా నిధుల కేటాయింపు సరిగాలేదని అలాగే కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం ప్రతిపాదనలో ఉన్న రాజోలి ప్రాజెక్టు పైన ఎటువంటి ప్రకటన లేకపోవడం కడప జిల్లా రైతులను కరువు మండలాల ప్రకటనలో ఏ విధంగా అన్యాయం చేశారో నిన్న ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో కూడా కడప జిల్లా రైతులకు, ప్రజలకు అన్యాయం చేశారని బడ్జెట్ అంతా కూడా అమరావతి, పోలవరము ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు ఉందని ఇప్పటికైనా కడప జిల్లా రైతాంగం రాజకీయాలకతీతంగా ఐకమత్యంగా రైతాంగ సమస్యలపై ఉద్యమించకపోతే ఈ ఐదు సంవత్సరాల కాలం ప్రభుత్వం నుండి జిల్లారైతులకు ఎటువంటి సాయం లేకుండా నష్టపోతారని రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో రమణతోపాటు రైతు సేవా సమితి నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, సమితి సభ్యులు కోటయ్య గారి మురళి, అక్కిదారి రమేష్, మూలే రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోనే సమాజంలో గుర్తింపు

**దువ్వూరు - సూర్యవాస్తవం:** చదువుతూనే సమాజంలో ప్రతి ఒక్కరికి గుర్తింపు వస్తుందని, అందరికీ విద్యను అందించాలన్నదే ఉల్లాస్ లక్ష్యమని మండల అభివృద్ధి అధికారి రామకృష్ణ పేర్కొన్నారు . మంగళవారం మండలకేంద్రమైన దువ్వూరులోని ఎంపిడిఓ సభా భవనంలో ఉల్లాస్ కార్యక్రమంపై ఎంపిడిఓ రామకృష్ణ అధ్యక్షతన మండలంలోని అంగన్వాడీ టీచర్లకు, విఓఏ లకు, వయోజన విద్య కోఆర్డినేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరగాళ్లు పెట్రేగి పోతున్నారని వారి బారి నుంచి తప్పించుకోవాలంటే, చదువు రాని వారికి చదువు నేర్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు.వెలుగు ఎపిఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో చదువు కొందరికే పరిమితమయ్యేదని సమానత్వం కోసం ఆడవారికి చదువు అవసరమమన్నారు. 200 రోజుల పాటుగా అంగన్వాడీ కేంద్రాలలో 10 మందికి ఒక వాలంటీర్ చదువు నేర్పించాలన్నారు. మండలానికి వెయ్యి మందికి పైగా వయో వృద్ధులకు చదువు నేర్పించాల్లన్నదే లక్ష్యమన్నారు. చదువు నేర్పించే వారికి ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదని కేవలం సేవా దృక్పధంతో చదువు నేర్పించాలన్నారు.ఎంఈఓ 1రవిశంకర్ ఎంఈఓ2 భాస్కర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి, సౌజన్య లు మాట్లాడుతూ గతంలో చదువు రాని వారి కోసం ప్రభుత్వం రాత్రి వేళల్లో వయోజ విద్య, సాక్షరతా భారత కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. వయో వృద్ధులకు ప్రతి రోజు ఒక గంట పాటు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి గోసుల వీరారెడ్డి, వెలుగు సీసీలు, యానిమేటర్లు, అంగన్వాడి టీచర్లు, వివో ఏలు పాల్గొన్నారు.






# అందరికీ విద్యనందించాలన్నదే ఉల్లాస్ లక్ష్యం

## - ఎంపీడీవో ఫణి రాజకుమారి




**సిద్దవటం - సూర్యవాస్తవం:** అందరికీ విద్యనందించాల్లన్నదే ఉల్లాస్ లక్ష్యమని ఎంపిడిఓ ఫణి రాజకుమారి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఎంపిడిఓ సభా భవనంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై ఎంపిడిఓ అధ్యక్షతన వివోఏ లకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు పెట్రేగి పోతున్నాయని వాటి బారి నుంచి చదువు రాని వారికి చదువు నేర్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఎపిఎం సుజాత మాట్లాడుతూ గతంలో చదువు కొందరికే పరిమితమయ్యేదని సమానత్వం కోసం ఆడవారికి చదువు అవసరమమన్నారు. 200 రోజుల పాటుగా అంగన్వాడీ కేంద్రాలలో 10 మందికి ఒక వాలంటీర్ చదువు నేర్పించాలన్నారు. సిద్దవటం మండలానికి 746 మంది వయో వృద్ధులకు చదువు నేర్పించాల్లన్నదే లక్ష్యమన్నారు. చదువు నేర్పించే వారికి ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయదని కేవలం సేవా దృక్పధంతో చదువు నేర్పించాలన్నారు. ఎంఈఓ-2 అరుణ, ఏసీడిపిఓ శోభారాణి లు మాట్లాడుతూ గతంలో చదువు రాని వారి కోసం ప్రభుత్వం రాత్రి వేళల్లో వయోజ విద్య, సాక్షరతా భారత కేంద్రాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. వయో వృద్ధులకు ప్రతి రోజు ఒక గంట పాటు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. కష్టమైన పనిని ఇష్టంగా చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, వెలుగు సీసీ లు, యానిమేటర్లు పాల్గొన్నారు.

# రెడ్ బుక్ రాజ్యాంగంలో అక్రమ అరెస్టులు

## - వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గుమ్మల సాయి కుమార్ రెడ్డి



**చెన్నూరు - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని వైయస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు ఈ రెడ్ బుక్ రాజ్యాంగంతో అక్రమ అరెస్టులకు బలవుతున్నారని వైఎస్ఆర్సిపి జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన చెన్నూరు లో విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలే టార్గెట్ గా తీసుకొని వారిని అక్రమ అరెస్టులతో తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తున్నారని ఇంత అరాచకం, ఇంత అన్యాయం గతంలో ఎప్పుడూ లేదని పౌర హక్కులను కాలరాసే విధంగా కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్నదని ఇది సరైన పద్ధతి కాదని ఆయన కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. వైయస్సార్ సిపి నాయకులు వర్ర రవీంద్రనాథ్ రెడ్డిని అలాగే వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కో కన్వీనర్ కల్లూరు రుద్రసేనారెడ్డిని అరెస్టు చేయడం దారుణమని, అరెస్టు చేసి అతనిని పోలీసులు చితక బాధడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలో వాక్ స్వాతంత్రాన్ని కాలరాసి వారి మనోభావాలను హరించడం బాధాకరమని తెలిపారు. ఇలా ఎంత మందిని అరెస్టు చేసి హింసిస్తారని ఇలాంటి అరెస్టులకు వైయస్ఆర్సీపీ కార్యకర్తలు నాయకులు భయపడరని, కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

## - ఐపీసీపీ చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** ఎన్నికల సమయంలో కూటమి పార్టీల గెలుపు కోసం చేనేతల ఓట్లు వేయించుకుని, బడ్జట్ లో చేనేత కార్మికులకు మొండి చేయి చూపారని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2,94,427 కోట్ల బడ్జెట్లో చేనేత పేరే లేకపోవడం అన్యాయమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత రంగానికి 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ఎన్.డి.ఏ కూటమి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి రూ.11,855 కోట్లు కేటాయించగా వ్యవసాయం తర్వాత ప్రధాన రంగమైన చేనేతకు మాత్రం అందులో ఐదవ వంతైనా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల ప్రచారంలో, యువగళం పాదయాత్ర సమయంలో మంత్రి నారాలోకేష్ చేనేత రంగం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చి, బడ్జెట్లో కనీసం చేనేత పేరైనా ఎత్తకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వర్క్ షెడ్లకు 3 సెంట్లు స్థలం కేటాయించి చేనేత కార్మిక కుటుంబ సభ్యులను అదుకోవాలని కోరారు. బడ్జెటులో చేనేత రంగానికి రూ.3 వేల కోట్లు కేటాయించడం తోపాటు 300 యూనిట్ల ఉచిత కరెంటు జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# సభ్యత్వ నమోదుతో భరోసా



**మదనపల్లె క్రైమ్ - సూర్య వాస్తవం:** టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని 35వ వార్డు టిడిపి ఇంఛార్జ్ కురముట్ల నాగరాజు స్పష్టం చేశారు. బుధవారం కాట్లాటపల్లి రోడ్డు, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు రామిశెట్టి నీలకంఠ, మోడెం సిద్ధప్ప, రామిశెట్టి కృష్ణ, ఉప్పు రామచంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కురముట్ల నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు వార్డులో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. 2 వేల సభ్యత్వాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇప్పటికే 1500 సభ్యత్వాలు పూర్తిచేశామన్నారు. లక్ష్యానికి మించి సభ్యత్వాలను నమోదు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రూ.100 చెల్లించి సభ్యత్వాన్ని తీసుకున్న ప్రతి ఒకరికి రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. సభ్యత్వ నమోదులో మదనపల్లిని అగ్రస్థానంలో నిలిపి ఎమ్మెల్యే జహాకి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర, కె.దీపక్ కుమార్, తేజ, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, మారుతీ నగర్, రాజా నగర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి ప్రణాళికపై అధికారులకు శిక్షణ




**నార్పల - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ గంగావతి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పంచాయితీ కార్యదర్శులకు గ్రామాల సమగ్రాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ సుమన జయంతి ముఖ్య అధితిగా హాజరై గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీలో తీసుకోవలసిన మెళకువలు, సలహాలు, సూచనలు తెలిపారు. ఈసందర్భంగా ఈఓఆర్డి శైలజారాణి, శిక్షకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలన్నారు. గ్రామాలలో చేపట్టవలసిన పనులు అభివృద్ధి కార్యక్రమాలు గురించి గ్రామస్థాయిలో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంగా వ్యవహరించి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. బుధవారం మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులకు కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఈ సమావేశంలో ఈఓఆర్డి శైలజారాణి, మండల ప్రభుత్వ వైద్యులు ప్రవీణ్ కుమార్, మహేంద్ర మండలపశు వైద్యాధికారి గోవిందరాజులు, మండల వ్యవసాయ అధికారి చన్న వీరస్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ జనార్ధన్, ఎపీఎం తిప్పమ్మ, ఉపాధి హామీ ఏపీఓ లు ఎర్రమ్మ, రమేష్ రామారావు వివిధ శాఖల అధికారులు మహిళా సంఘాల యానిమేటర్లు, లీడర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీపీఎం ధర్నాని జయప్రదం చేయండి

**- జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున పిలుపు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంల ప్రధాన డిమాండ్లు చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమం కొనసాగింపులో భాగంగా ఈ నెల 14 వ తేదీన జిల్లా వ్యాప్తంగా మండల తాసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రజలు, ప్రజా సంఘాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థి సంఘాలు యువజన సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఈ నెల 14 వ తేదీన మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు మధు తిమ్మరాజు తిప్పేస్వామి నాయకులు రాజు మారన్న రామాంజనేయులు శివ రాజా అంజనీ నరేష్ అశోక్ సిపి ఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ మాజీ కౌన్సిలర్ మృతిరాలికి నివాళులు



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నగదాని జయన్న తల్లి 15వ వార్డ్ మాజీ కౌన్సిలర్ నగదని గిడ్డమ్మ స్వర్గస్తులైన విషయం, తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, వెంకట శివుడు యాదవ్, అనంతరం వారి స్వగృహానికి వెళ్లి మృతురాలికి పూలమాల వేసే నివాళులు అర్పించి, వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు.

## నివాళులర్పించిన గుమ్మనూరు నారాయణ



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తిపట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగదాని సత్య నారాయణ, తల్లి 15 వార్డు మాజీ కౌన్సిలర్ నగదాని గిడ్డమ్మ ఆకస్మికంగా మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న గుంతకల్ నియోజకవర్గం, శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ, గుత్తి పట్టణంలో ఉన్న వారి స్వగృహానికి విచ్చేసి మృతురాలి భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అదే విధంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ, నాయకులు బిజెపి కార్యకర్తలు, జనసేన సైనికులు, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అసత్య ఆరోపణలు మానుకోవాలి

**- డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి**



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రజల ప్రాణాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం, అవినీతి జరుగుతుందనే పామిడి ప్రభుత్వాసుపత్రికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పామిడి ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేయడానికి జిల్లా వైద్య అధికారులు వస్తున్నారు. కావున ఫిర్యాదు చేయడానికి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారు ఫిర్యాదు చేయవచ్చని హాస్పిటల్ ఇన్చార్జి శివ కార్తీక్ రెడ్డి తెలియజేశారు. ఫిర్యాదు చెస్తే నిజనిర్ధం చేసి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోబడును అని తెలియజేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాలి

**- అనంతపురం మెడికల్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే**
**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**






**అనంతపురం బ్యూరో - సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్లు వైద్య సేవలు ఎక్కువ సంఖ్యలో అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్. వి, ఐఏఎస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ వైద్య కళాశాల 2024 వ బ్యాచ్ వైద్య విద్యార్థులకు అవిన్య పేరుతో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి, ఐఏఎస్ హాజరయ్యారు. వీరికి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ మాణిక్య రావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వేంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్‌లు, వైద్య విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. 2024 వ బ్యాచ్ మొదటి సంవత్సరం మెడికల్ స్టూడెంట్స్‌ను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం ద్వారా, ప్రజల బాధలను అర్థం చేసుకొని, సేవే పరమావధిగా వైద్య వృత్తిని నిర్వహించవచ్చని, అపజయాలను పట్టించుకోవద్దని, ప్రతి అపజయం విజయానికి పునాది అని, వైద్య వృత్తిలో ఉండడం మీరు చేసుకున్న అదృష్టమని, జీవితాంతం ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం కంటే మించిన సౌభాగ్యం లేదన్నారు. మన మనసును కాలాన్ని వెనక్కు తీసుకెళ్లగలగే శక్తి కేవలం జ్ఞాపకాలకు మాత్రమే ఉంటుందని, అలాంటి ఎన్నో జ్ఞాపకాలను ఈ కళాశాలలో పదిల పరచు కోవాలని తెలిపారు. సందర్భంగా అందరితో హిప్పొక్రటిక్ ఓత్, చరక సంహిత ఒథ్ ను విద్యార్థులతో కలిసి ప్రమాణం చేశారు. నూతన వైద్య విద్యార్థులకు ఐడి కార్డులను అందజేసి వారికి బెస్ట్ విషెస్ తెలియజేశారు. తాను కూడా డాక్టర్ నేనని కానీ తల్లిదండ్రులు కోరిక మేరకు ఐఏఎస్ ఆఫీసర్ గా అనేకమంది పేద ప్రజలకు ఇంకా ఎన్నో సేవలు, ప్రభుత్వ పథకాలను అందించే మంచి అవకాశం కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ మాణిక్యరావు మాట్లాడుతూ.. మన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి, ఐఏఎస్ మీ అందరికీ స్ఫూర్తిని, ఇలాగే ఎంబిబిఎస్ విద్యను ప్రతిష్టాత్మక బెంగళూరు మెడికల్ కళాశాలలో పూర్తిచేసి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందించి, అతి చిన్న వయసులో మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ ఆఫీసర్ గా పదోన్నతి పొందారని తెలిపారు. అనంత వైద్య కళాశాల దేశంలో ఏ కళాశాలకు తీసుపోనీ విధంగా తయారు చేయాలన్నదే మా దృఢ సంకల్పమని ప్రభుత్వ సహకారంతో, గౌరవ కలెక్టర్ గారి సహకారంతో మంచి వైద్య విద్యను అందించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు ఎంబిబిఎస్ వైద్య విద్య మాత్రమే కాకుండా, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులను కూడా విద్యార్థులు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు సినిమా పాటలకు చేసిన నృత్యాలు, నాటికలు, పాటలు, లైవ్ ఆర్కెస్ట్రా, ఫ్యాషన్ షో, అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ షారోన్ సోనియా, తెలుగు మధు, ప్రొఫెసర్లు డాక్టర్ భీమసేన చారి, వైఎంఎస్ ప్రసాద్, శంకర్, ఉమామహేశ్వరరావు, సరళ, లక్ష్మి, డాక్టర్ శైలజ, సుమన గోపీచంద్, నిహారిక, గాలిటి చంద్రశేఖర్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కుల్లాయి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** ఏ.ఆర్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా "దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న నిర్వహించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని ఏ.ఆర్ సిబ్బంది సమస్యలను తొందర్లోనే పరిష్కరించే విధంగా చూస్తామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్"దర్బార్" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించినారు. ఈ దర్బార్ లో క్యాజువల్ లీవు, ట్రాన్ఫర్స్, టిఎలు, అలవెన్సులు, ఎఆర్, స్పెషల్ పార్టీ పోలీసుల బందోబస్తులు, జిపిఎఫ్ లోన్, మెడికల్ బిల్లులు, సినియార్టీ లిస్టు, ప్రమోషన్ , బదిలీలు తదితర సమస్యల గురించి జిల్లా ఎస్పీకి సిబ్బంది విన్నవించుకున్నారు. వారి సమస్యలను జిల్లా ఎస్పీ విని, తన పరిధిలో ఉన్న వాటిని ఇక్కడే పరిష్కరిస్తానని, మేజర్ గా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కూడా కృషి చేస్తానన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎఆర్, స్పెషల్ పార్టీ పోలీసుల సాధక బాధలు తెలుసుకోవడానికే పోలీస్ దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశామని, తన పరిధిలో ఉన్న మీ సమస్యలను ఇక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాను అన్నారు. మరిన్ని సౌకర్యాల కోసం ప్రభుత్వం దృష్టికి ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలో సిబ్బందికి ప్రధానంగా ఆరోగ్యం, విద్య సంబంధించిన సమస్యలు తన దృష్టికి వచ్చాయని వీటికి కూడా త్వరలోనే పెంచే విధంగా చూస్తానన్నారు. బందోబస్త్, ఎస్కార్ట్ విధులు పట్ల చాల అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏఆర్ సిబ్బంది శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామాలు అలవరచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. మీ సమస్యలన్నిటికి కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చూద్దామన్నారు. అలాగే వృత్తిపరంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ సమస్యలు తెలుసుకోవడానికి ఎస్పీ పోలీసు దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో హర్షనీయమని ఈ సందర్భంగా ఎస్పీకి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా షూస్ మెటీరియల్ పంపిణీ చేశారు. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఏఓ సుజాత, సూపర్డెంట్ సరస్వతి, ఆర్.ఐలు వలి, మహేష్, డీసీ ఆర్ బీ సీఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీతోనే మైనారిటీలకు న్యాయం




**అమరావతి - సూర్య వాస్తవం:** స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి తరపున ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వనికి ముందుంచిన ప్రస్తావనలను చంద్రబాబు నాయుడు టీటీడీ ప్రభుత్వం ఆమోదించి వెంటనే అమలుపరిచే దిశగా అడుగులు వేయడం ఆనందకరమైన విషయమని తెలిపారు ఫారుక్ షిబ్లి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో న్యాయం జరగని వారికి సైతం ప్రస్తుతం ఉన్నటువంటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం న్యాయం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన హాజీరా కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించడం, అదేవిధంగా ఆత్మహత్య చేసుకున్న చదువులు తల్లిగా పిలవబడిన మిస్బా కుటుంబానికి రూపాయలు ఆర్థిక సాయం, వైసీపీ ప్రభుత్వ హయాంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అండగా ఉన్న నరసరావుపేటకు చెందిన ఇబ్రహీంను నడిరోడ్డుపై అతికిరాతంగా హతమార్చడం జరిగింది. వారి కుటుంబానికి కూడా రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఇదే క్రమంలో అనంతపురం జిల్లాకు చెందిన మృతుడు అబ్దుల్లా భార్యకు ఉద్యోగాన్ని కల్పిస్తూ, చీరాల ఈర్లపాలెం కు చెందిన అమిన్ ఆరిఫ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ కల్పన చేయడం జరిగింది. గత జగన్ ప్రభుత్వంలో ఆగిన ఇమామ్ మౌజన్ల ఏడు నెలల గౌరవ వేతనాన్ని అందించేందుకు ప్రస్తుత ప్రభుత్వం అంగీకరించింది. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు లక్ష రూపాయల సబ్సిడీ అందించేందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మైనారిటీ, న్యాయ శాఖ మంత్రివర్యులు పెద్దలు ఎం ఎం డి ఫరూక్‌కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తూ ఆయన కార్యాలయంలో థాంక్యూ సీఎం సర్ అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు మౌలానా హుస్సేన్, ఇఫ్తేఖర్ జమాల్, అబ్దుల్ గఫూర్, అలాగే విజయవాడ నాయకులు ఇమ్రాన్ శమ్మి తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి సహకారం అందించండి





**నార్పల - సూర్య వాస్తవం:** మండలాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ని నార్పల మండల టిడిపి నాయకులు ఆకుల విజయ్ కుమార్ బాబు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రమైన అనంతపురంలోనీ విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ సంపత్ కుమార్ ను టిడిపి నాయకులు ఆకుల బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఇ తో నార్పల మండలం లోని విద్యుత్ సమస్యలపై చర్చించారు. నార్పలకు రెగ్యులర్ ఏఈ లేక మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నార్పలకు రెగ్యులర్ ఏఈ ని నియమించడంతోపాటు నార్పల విద్యుత్ సబ్ స్టేషన్ మొత్తం పిచ్చి మొక్కలు, కంపచెట్లతో అపశుభ్రంగాఉందన్నారు. దీంతో విష కీటకాలకు నిలయంగా మారిందన్నరు. వీటివల్ల చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. వెంటనే సబ్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ నీ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయ్ కుమార్ (బాబు)కోరారు. అదేవిదంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ స్వగృహంలో కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎంపీ తో టిడిపి నాయకులు విజయకుమార్ బాబు మాట్లాడుతూ మండలంలో ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారనీ ఆకుల బాబు తెలిపారు. ఆయన తో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో సూపర్ 6 పథకాలు ఫ్లాప్

**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్రం లో కూటమి పాలనలో సూపర్ 6 పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయనీ తెలిపారు కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసీ రెడ్డి సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తేలిపోయిందనీ కొన్ని పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. మరి కొన్నింటికి అరకొర కేటాయింపులు. యువతను నమ్మించి మోసగించింది. నిరుద్యోగ భృతి క్రింద కేటాయింపులు లేవు. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు నామ మాత్రపు కేటాయింపు రు 322 కోట్లు. కూటమి ప్రభుత్వం యువత క్రోధాగ్నికి గురికాక తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలను కూడా నమ్మించి మోసగించింది. మహా లక్ష్మి పథకం క్రింద కేటాయింపులు లేవు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పై స్పష్టత లేదనీ తల్లికి వందనం పథకం క్రింద ఏడాదికి రు 12,600 కోట్లు కావలసి వుండగా,



రు.5387 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు రు. 10,717 కోట్లు అవసరం కాగా కేటాయింపు రు 4,500 కోట్లు మాత్రమే ఉందనీ విద్యా దీవెన,వసతి దీవెన పథకాల ఊసే లేదన్నారు. అప్పుల్లో మాత్రం ఆల్ టైమ్ రికార్డు.2024- 25 ఆర్థిక సంవత్సరం లో చేయబోయే అప్పు రు 91,443 కోట్లు.కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసగించింది. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు గా తయారయిందన్నారు. వైకాపా పార్టీ కప్పుకోను చాలదు, కట్టుకోను చాలదు అన్నట్లు తయారయింది. అధికార పార్టీకి పనికిరాదు, ప్రతిపక్ష పార్టీకి పనికి రాదన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే, ఇంటింటా సౌభాగ్యం వెల్లివిరియాలంటే ఒక్క కాంగ్రెసు తోనే సాధ్యమన్నారు.

# పోషణ వాటికలతో సంపూర్ణ ఆరోగ్యం

**నార్పల - సూర్య వాస్తవం:** పోషణ వాటికతో సంపూర్ణ ఆరోగ్యం అని అనంతపురం ఐసీడీఎస్ పీడీ బి.ఎన్ శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రమైన నార్పలలోని అంగన్వాడి సొంత భవనాలకు సాక్ష్యం అంగన్వాడి పథకం ద్వారా పోషణ వాటికలు 6 కేంద్రాలకు మంజూరు కావడంతో పిడి శ్రీదేవి, నార్పల సిడీపీఓ భారతి అందులో భాగంగా నార్పలలోని ఉయ్యాల కుంట లోని రెండు అంగన్వాడీ కేంద్రాలలోను, అంబేద్కర్ నగర్, సుల్తాన్ పేట కేంద్రాలలో పోషణ వాటికలు ఐసిడిఎస్ పిడి బిఎన్.శ్రీదేవి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాటిలో పండ్ల మొక్కలు, ఆకుకూరల మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. వీటిలో పండే పండ్లు కూరగాయల వల్ల కేంద్రాలకు వచ్చిన వారికి అందజేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నార్పల ప్రాజెక్ట్ సిడిపిఓ భారతి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త సుధా, అందరూ కలిసి చెట్లు నాటారు. పోషణ వాటికల్లో నాటిన చెట్లను మన పిల్లలు లాగా చూసుకోవాలని శ్రద్ధగా పెంచాలని పెద్ద మొక్కల మధ్యలో చిన్న చిన్న ఆకుకూరలు కూరగాయలు పెంచాలని సుధా తెలిపారు కాంపోస్టు ఎరువులు తయారు చేసుకుని మొక్కలకు వేయాలని రోజు



వాటిని శ్రద్ధగా చూసుకోవాలని పిడి సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమలోఎంపిడిఓ ఎస్. గంగావతి, ఈఓర్డి శైలజా రాణి, నార్పల పంచాయితీ కార్యదర్శి గట్టు శ్యామల, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుణాలినీ, మధుమాలిని, అంగన్వాడి కార్యకర్తలు డొక్కా శ్రీదేవి, లలితమ్మ, రేణుక, సహాయకులు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# అహుడ ఛైర్మన్ పదవి వరుణ్‌కి ఇవ్వడం హర్షనీయం

**గుత్తి - సూర్య వాస్తవం:** గుంతకల్ నియోజకవర్గం, గుత్తి పట్టణం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయ బాద్యుడు, వాసగిరి మణికంఠ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం - హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ ఆధారిటీ ఛైర్మన్ పదవి టిసి వరుణ్ కి కేటాయించడం హర్షనీయమని నవసమాజ నిర్మాణానికి నడుంబిగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా 15 సంవత్సరాలుగా సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేసినా ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, టిసి వరుణ్ ని గుర్తించి అహుడా ఛైర్మన్ పదవి ని ఇవ్వడం శుభ పరిణామం




అన్నారు. ఈ నెల 14 వ తారీఖున ఉదయం 10:30 గంటలకు గుత్తి బాటలో సుంకులమ్మ ఆలయం నుండి వయా గుత్తి పట్టణం మీదుగా అనంతపురం పట్టణం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలుగుదేశం, బిజెపి, జనసేన కుటుంబ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుత్తి మండల, పట్టణ అధ్యక్షులు పోతురాజుల చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్ జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్ గుత్తి సీనియర్ నాయకులు, నాగయ్య రాయల్, అశ్వ నాగప్ప, అఖండు భాష, ధను, మిద్దె ఓబులేసు, హసన్, ఒబిచర్ల రమేష్ గుంతకల్ నాయకులు, కసాపురం నంద, గాజుల రాఘవేంద్ర, సుబ్బయ్య, అమర్, సుంకర నాగరాజు, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ పర్యటన విజయవంతం చేద్దాం

**హిందూపురం టౌన్ - సూర్య వాస్తవం:** అణగారిన హక్కుల ఉద్యమ కారుడు ఎస్సీ వర్గీకరణ సాధకుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 16 వ తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రానికి విచ్చేయుచున్న సందర్భంగా హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా మాదిగలు, మాదిగ ఉపకులాలు పెద్దఎత్తున తరలి వచ్చి మందకృష్ణ పర్యటన దిగ్విజయం చేయాలని ఏం ఆర్ పీ ఏస్ ఏం ఈ ఎఫ్ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఏం ఈ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసుధన్ ఏం ఆర్ పీ ఏస్ సీనియర్ నాయకులు ఆంజినేయులు, ఏం ఆర్ పీ ఏస్ తాలుక అధ్యక్షులు సతీష్ ఏం ఈ ఎఫ్ నాయకులు రామకృష్ణ, శివ,



రాము కిరణ్ ఏం ఆర్ పీ ఏస్ నాయకులు నాగార్జున, సింగిరెడ్డిపల్లి నాగరాజు, విక్కి, సద్లపల్లి నాగరాజు, మేళాపురం నాగన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎం ఈ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ ఆశయానికి అనుగుణంగా ఇటీవల ఏ బి సి డి వర్గీకరణకు సుప్రీం కోర్ట్ తీర్పు ఇవ్వడం హర్షించ తగ్గ విషయం అన్నారు,సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు సీఎం చంద్రబాబు. నాయుడు మంచి మనసుతో వర్గీకరణకు చర్చలు ప్రారంభించడం జరిగిందన్నారు, ఈ నెల 16 న అనంతపురం నగరంలో జరుగు మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి మాదిగలందరూ అనంతపురం తరలిరావాలని కోరారు.

# కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

**అనంతపురం - సూర్య వాస్తవం:** ఈ రోజు బెలుగుప్ప మండలము నందు ఎస్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి ఉపాధ్యాయుల సమస్యలు సేకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరడమైనది. కె జి బి వి ఉపాధ్యాయులకు ఎం టి ఎస్ అమలు చేయాలని అలాగే ప్రతి నెల అందరు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేయడమైనది. మోడల్ స్కూలు ఉపాధ్యాయులకు జూనియర్ కాలేజీ లలో లెక్చరర్లు గా కన్వర్షన్ పోయే వారికి అవకాశం ఇవ్వాలని, జూనియర్ కాలేజీల లో ప్రిన్సిపాల్ గా పదోన్నతులు ఇవ్వాలని అలాగే పెండింగ్ లో



ఉన్న ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమైనది. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ లకు జూనియర్ లెక్చరర్లు గా పదోన్నతులు ఇవ్వాలని కోరడమైనది. మండలము లోని కాల్వపల్లి, దిద్దేకుంట, అంకంపల్లి రామసాగరం, తగ్గుపర్తి, బెలుగుప్ప తదితర పాఠశాలలలో సభ్యత్వము సేకరించడ మైనది. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు ఎన్ రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు, మండల సీనియర్ నాయకులు యు. ఇమామ్ సాహెబ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడికి జీవితకాల జైలు శిక్ష

**అనంతపురం క్రైం -.సూర్య వాస్తవం:** పోక్సో కేసు లో ముద్దాయి గొల్ల ఆదినారాయణ వయస్సు 54 సం" తండ్రి లేట్ రామప్ప నార్సింపల్లి గ్రామం గోరంట్ల మండలము, శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లా అను అతనికి జీవిత ఖైదు జైలుశిక్ష. రూ.1000 జరిమానా. బాధితురాలకు 10 లక్షల రూపాయలు నష్టపరిహారం. చెల్లించి విధంగా తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లా, గోరంట్ల మండలం నార్సీంపల్లి గ్రామంలో 18.11.2020 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి ఉండగా పాప (వయస్సు 5 సంవత్సరాలు) వారి ఇంటి వద్ద ఆడు కొనుచుండగా పై తెలిపిన ముద్దాయి, బాధితురాలకు మాయ మాటలు చెప్పి తన ఇంటిలోని పిలుచుకుని పోయి మానభంగం చేసినాడని, బాధితురాలి తల్లి ఫిర్యాది మేరకు గోరంట్ల సీఐ జయ నాయక్ కేసు నమోదు చేసి అనంతరం అప్పటి అనంతపురం దిశ మహిళ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు (ప్రస్తుత సత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ) కేసును దర్యాప్తు చేసి, దర్యాప్తు అనంతరం, ఫోక్సు కోర్టులో ఛార్జ్ షీట్ దాకాలు చేశారు. ఈ కేసులో జడ్జి రాజ్యలక్ష్మి.. 10 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున మంగళవారం నాడు తేదీన ముద్దాయికు జీవిత ఖైదు జైలు శిక్ష 1000/- జరిమానా విధించారు. బాధితురాలకు 10 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని జడ్జి ఆదేశించారు.ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసు వారి తరపున ఈ కేసును పీపీ ఈశ్వరమ్మ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న ఆదేశాల మేరకు గోరంట్ల సీఐ శేఖర్ పర్యవేక్షణలో కోర్టు లైజర్ ఆఫీసర్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితుడికి శిక్ష పడేందుకు తమ వంతు కృషి చేసినా ఇతర అధికారులను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

# హిందూపురంలో సీపీఎం ధర్నా




**హిందూపురం టౌన్ - సూర్య వాస్తవం:** హిందూపురం పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంద్ర పార్క్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ హిందూపురం మండలం కొల్ల కుంట దగ్గర 8 న తేదీన అర్ధరాత్రి మూడు గంటల సమయంలో పేదలు వేసుకున్న గుడిసెలను ఎలాంటి నోటీసు ఇవ్వకుండ నేలమట్టం చేశారు కూల్చడంలో భాగంగా దాదాపు అక్కడే నివాసం ఉంటున్న 100 కుటుంబాలు బాడుగ ఇల్లు ఖాళీ చేసి అక్కడే బసచేస్తున్నారు వారంతా ఎక్కడికి వెళ్లాలి అని హిందూపురం ఎమ్మార్వో ని నీలుడిసారు మహిళలు పేదలంతా కూల్చిన చోటే మాకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని అది ప్రభుత్వ స్థలం కాబట్టి పేదలకు ఇవ్వాల్సిన బాధ్యత మీపై ఉన్నది ఇప్పటికి ఎనిమిది నెలల నుండి ఆఫీసు చుట్టూ తిరుగుతూ ఆఖరి క్షణంలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకోవడం జరిగింది అన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి మాకు వెంటనే స్థలాలు ఇవ్వాలి లేని పక్షంలో ఎక్కడ వరకు అయినా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రాము రమణ బాబావాలి రాజప్ప రామకృష్ణ ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు జ్యోతమ్మ లక్ష్మీదేవి అమ్మ సరస్వతి నర్సిం తాజ్ ఆయేషా తహదారులు పాల్గొన్నారు.

# రఘువీరారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఇనాయతుల్లా

**హిందూపురం - సూర్య వాస్తవం:** మాజీ మంత్రి, సిడబ్ల్యూసి మెంబర్ డాక్టర్ రఘువీరారెడ్డి ని మంగళవారం నాడు ఆయన నివాసంలో శ్రీ సత్య సాయి జిల్లా డిసిసి అధ్యక్షులు యం.యచ్ ఇనాయతుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు కోటా సత్యం, అనంతపురం జిల్లా డిసిసి అధ్యక్షులు మధుసూదనరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం గురించి పలు విషయాలపై చర్చించారు.



# గ్రామాభివృద్ధి ప్రణాళిక పై అధికారులకు శిక్షణ

**పామిడి - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ తేజోష్ణ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పంచాయితీ కార్యదర్శులకు గ్రామాల సమగ్రాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రోజున గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-26 తయారు చేయు నిమిత్తము మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, వి ఓ ప్రెసిడెంట్లకు శిక్షణా కార్యక్రమము నిర్వహించడమైనది. ఈ కార్యక్రమము లో డిఎల్ డిఓ గుంతకల్లు విజయలక్ష్మి, ఈఓ ఆర్ డి, క్రిష్ణ కుమార్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వి ఓ, గ్రామ సర్పంచులు, శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.




# అహుడ ఛైర్మన్ టీసీ వరుణ్‌కు శుభాకాంక్షలు

**అనంతపురం - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా నాయకులు టి సి వరుణ్ కు అనంతపురం, హిందూపురం అహూడ ఛైర్మన్ గ ఎన్నికైన సందర్భంగా అనంతపురం జనసేన 15 వ డివిజన్ ఇన్చార్జి నాయకులు జయకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ టి. సి వరుణ్ పార్టీ కి చేసిన సేవలు గుర్తించి ఆయనకు అహుడ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. టీ సి వరుణ్ ఇంకా ముసు ముందు మరిన్ని ఉన్నత పదవులు పొందాలని జయకృష్ణ కోరారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )